News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :88 | ఖమ్మం | బుధవారం, మే 13, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# నీట్ పరీక్ష రద్దు

- పేపర్ లీకేజీ నేపథ్యంలో ఎన్‌టీఏ నిర్ణయం
- మళ్లీ కొత్తగా పరీక్ష.. వారం పది రోజుల్లో తేదీల వెల్లడి
- కొత్తగా రిజిస్ట్రేషన్ అక్కర్లేదు.. ఫీజు రిఫండ్
- రద్దు.. విద్యార్థులకు ఇబ్బంది కలిగించే నిర్ణయమే
- కానీ, పరీక్షలపై ఉన్న నమ్మకం వమ్ము కావద్దనే!
- తప్పునకు బాధ్యత వహిస్తున్నాం: ఎన్‌టీఏ చీఫ్
- సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశం
- కేసు నమోదు.. పలు రాష్ట్రాలకు సీబీఐ బృందాలు
- గెస్ పేపర్ పేరుతో ప్రశ్నపత్రం లీకేజీ..
- కెమిస్ట్రీ, బయాలజీలో అవే ప్రశ్నలు
- నాసిక్ ప్రింటింగ్ ప్రెస్ నుంచి బయటకు?
- రూ.30 వేల నుంచి రూ.28 లక్షల వరకూ
- ధర నిర్ణయించి విక్రయించిన ఏజెంట్లు
- ఏపీ, తెలంగాణతోపాటు పలు రాష్ట్రాల
- కోచింగ్ సెంటర్లకు గెస్ పేపర్
- రాజస్థాన్‌లోని ఓ హాస్టల్ నిర్వాహకుడి ద్వారా
- ఎన్‌టీఏకి సమాచారం
- రాజస్థాన్‌లో కోటాకు పోటీగా ఎదుగుతున్న
- సికార్.. ఈ నేపథ్యంలోనే పేపర్ లీకేజీ?
- లీకేజీ, పరీక్ష రద్దుపై విద్యార్థి సంఘాల నిరసన

2లో






## విజయ్ సంచలన నిర్ణయం..
## తన కారు డ్రైవర్ కొడుక్కి ప్రభుత్వ చీఫ్ విప్ పదవి

- తమిళనాడు ప్రభుత్వ చీఫ్ విప్‌గా శబరినాథన్ నియామకం
- సీఎం విజయ్ కారు డ్రైవర్ రాజేంద్రన్ కుమారుడే శబరినాథన్
- టీవీకే తరపున విరుగంబాక్కం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన శబరినాథన్
- సామాన్యులకు ప్రాధాన్యత అంటున్న విజయ్ వర్గం, విమర్శిస్తున్న ప్రతిపక్షాలు

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన కారు డ్రైవర్ కుమారుడు, తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన శబరినాథన్‌ను ప్రభుత్వ చీఫ్ విప్‌గా నియమించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ అనూహ్య నియామకం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.శాసనసభ ఎన్నికల్లో, తన వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజేంద్రన్ కుమారుడు శబరినాథన్‌కు

- మిగతా2లో



## మళ్లీ దాడి చేస్తే అణు యుద్ధమే!?

అమెరికాను హెచ్చరించిన ఇరాన్

- మిగతా2లో

## నా కుమారుడు తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే

నా కుటుంబంపై కుట్రలు చేసినవాళ్లను వదిలిపెట్టను

హిందూ ఏక్తాయాత్రలో బండి సంజయ్ వ్యాఖ్యలు

నిజంగా నా కుమారుడు తప్పు చేస్తే వందశాతం శిక్ష పడాల్సిందే.. చట్టం ముందు అందరూ సమానమే' అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో

- మిగతా2లో



## 'ఏపీ, తెలంగాణ అవసరాల మేరకు కృష్ణా జలాలను వినియోగించుకోవాలి'

హైదరాబాద్: ఏపీ, తెలంగాణ తాగునీటి అవసరాల మేరకు కృష్ణా జలాలను వినియోగించుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశంలో నిర్ణయించారు. హైదరాబాద్‌లో జరిగిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో ఇరు రాష్ట్రాల ఈఎన్‌సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సాగర్‌లో

- మిగతా2లో





## జిల్లాకో సమస్య... వాటిపై ఎలుగెత్తుదాం

- ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రానున్న రెండేళ్లు పోరాడాలి
- డిజిటల్ పద్ధతిలో పార్టీ సభ్యత్వ నమోదు
- ముఖ్య నేతలకు భారాస అధినేత కేసీఆర్ దిశానిర్దేశం
- ఎర్రవల్లిలో ఆరు గంటలపాటు కొనసాగిన సమావేశం

"రాష్ట్రంలో ప్రస్తుతం జిల్లాకో సమస్య నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల వారీగా ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఎలుగెత్తాలి. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఉద్యమించాలి" అని భారాస అధినేత కేసీఆర్ తమ పార్టీ ముఖ్య నేతలకు ఆదేశించారు. పార్టీ సభ్యత్వ నమోదును డిజిటల్ పద్ధతిలో చేపట్టాలని నిర్ణయించారు. సభ్యత్వ నమోదు బాధ్యతలను ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ ప్రధాన కార్యదర్శులకు అప్పగించారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం పార్టీ ప్రధాన కార్యదర్శులు, ముఖ్యనేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. సుమారు ఆరు గంటలపాటు కొనసాగిన ఈ సమావేశంలో... ధాన్యం, శనగలు, మక్కల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను పలువురు నేతలు తమ అధినేత దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర రాజకీయ పరిణామాలపైనా చర్చించారు. అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ... "రాష్ట్రంలో అన్నదాతలతోపాటు అన్నివర్గాల ప్రజలూ సమస్యలతో సతమతమవుతున్నారు. వారికి పార్టీ అండగా నిలవాలి. రానున్న రెండేళ్లపాటు ప్రజక్షేత్రంలో ఉండేలా పోరాట పథాన్ని ఎంచుకోవాలి. సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగించుకోవాలి. ఓటరు జాబితాల సమగ్ర సవరణ(సర్)పైనా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. జిల్లా కేంద్రాల్లో శిక్షణ.. సభ్యత్వ నమోదు కమిటీలు: సభ్యత్వాల నమోదుకు ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఇద్దరు కార్యకర్తలను ఎంపిక చేసి, వారికి జిల్లా కేంద్రాల్లో

- మిగతా2లో

# ధాన్యం సేకరణ వేగంగా పూర్తిచేయాలి

- నిర్లక్ష్యంగా ఉంటే కలెక్టర్లపైనా చర్యలు
- గోడౌన్ల సమస్య ఉన్నచోట తాత్కాలిక ఏర్పాట్లు చేయండి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సమస్య తీవ్రతకు అనుగుణంగా చర్యలు తీసుకోకపోతే కలెక్టర్లపైనా చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. కొనుగోళ్ల ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై మంగళవారం కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని.. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని సూచించారు.

**కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు**

చేసుకున్న ఒప్పందం మేరకు ధాన్యం తరలించేందుకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించవద్దని సీఎం స్పష్టం చేశారు. అవసరమైతే

- మిగతా2లో




## 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో దశ షురూ

ఇందిరమ్మ ఇళ్ల రెండో దశ పంపిణీని రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న ఆదిలాబాద్‌లో ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. రెండో దశకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామన్నారు. హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, శాసనమండలిలో చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఎంపీలు,

- మిగతా2లో



## రైల్ రోకో కేసులో కవితకు సమన్లు... సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు హాజరు కావాలని ఆదేశాలు...

రైల్ రోకో కేసులో టీఆర్ఎస్ చీఫ్ కవితకు సమన్లు జారీ చేసింది సికింద్రాబాద్ రైల్వే కోర్టు. బుధవారం ( మే 13 ) ఉదయం 10:30 గంటలకు కోర్టుకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది సికింద్రాబాద్ రైల్వే కోర్టు. గతంలో కవిత బీసీలకు 42శాతం రిజర్వేషన్ల డిమాండ్‌తో కామారెడ్డిలో రైల్ రోకో చేసిన క్రమంలో సమన్లు జారీ చేసింది కోర్టు.

కవితతో పాటు మరో 12 మంది టీఆర్ఎస్ నాయకులపై

- మిగతా2లో

## నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టుల రహస్య స్థావరం గుర్తింపు

- 'మాద్ బచావో అభియాన్' కింద చేపట్టిన ఆపరేషన్‌లో స్థావరం గుర్తింపు
- భారీగా నగదు, ఆయుధాలు, మందుగుండు సామాగ్రి లభ్యం
- ఇలాంటి ఆపరేషన్లు కొనసాగుతాయని పోలీసులు వెల్లడి

- మిగతా2లో



## పెట్రోల్, డీజిల్ లభ్యత, ధరలపై కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు

- ఎక్కువ కాలం కొనసాగితే వినియోగదారులపై భారం మోపే పరిస్థితి రావొచ్చని అభిప్రాయం
- దేశంలో తగినన్ని చమురు నిల్వలు ఉన్నాయన్న హర్దీప్ సింగ్ పూరి
- రిటైల్ ఇంధన లభ్యతపై కేంద్రం భరోసా

రిటైల్ ఇంధన లభ్యతపై కేంద్రం భరోసా ఇచ్చింది. అయితే పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ అమ్మకాలపై చమురు మార్కెటింగ్ కంపెనీలు నష్టపోవడం పట్ల కేంద్ర

- మిగతా2లో



# ధాన్యం సేకరణ వేగంగా పూర్తిచేయాలి

- మొదటి పేజి తరువాయి

అలాంటి కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని రవాణాశాఖ కమిషనర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమస్య తీవ్రతను గుర్తించి కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతి అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిందేనని స్పష్టం చేశారు. "ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్లకు తరలించాలి. వివిధ ప్రాంతాల్లో గోడౌన్ల సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. అలాంటి ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి కలెక్టర్లు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలి. రైతుబజార్లు, ఫంక్షన్ హాళ్లకు ధాన్యాన్ని తరలించాలి. వెసులుబాటును బట్టి అక్కడి నుంచి గోడౌన్లకు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోండి.

**అకాలవర్షాల నష్టాన్ని తగ్గించాలి**

అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుచేయాలి. శాశ్వత పరిష్కార దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలి. కల్లాల వద్ద ధాన్యం తడవకుండా టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలి. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని సేకరణ సాఫీగా జరిగేలా చూడాలి. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదిక పంపించాలి. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలి. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానిక హమాలీలతో పని చేయించుకోవాలి.

**ధాన్యం లోడ్ చేయగానే రసీదు ఇవ్వాలి**

లారీలోకి ధాన్యం లోడ్ చేయగానే రైతులకు రసీదు అందేలా చర్యలు తీసుకోవాలి. అలాచేస్తే తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చు. లారీల కొరతను అధిగమించేందుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోండి. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయి. ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

**ఎలాంటి సహకారానికైనా సిద్ధంగా ప్రభుత్వం: మంత్రి ఉత్తమ్**

సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎలాంటి సహకారాన్ని అయినా అందించేందుకు సిద్ధంగా ఉందని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. జిల్లాల్లో ఎక్కడ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని అన్నారు. ధాన్యం సేకరణను వేగవంతంగా చేపట్టేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు.

**సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం: మంత్రి తుమ్మల**

సరిహద్దు రాష్ట్రాల రైతులు కొంతమంది ధాన్యాన్ని తెలంగాణలోని కేంద్రాలకు తరలిస్తున్నారని, దీంతో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు ధాన్యం తీసుకురాకుండా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నెలాఖరులోగా ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు.

# నీట్ పరీక్ష రద్దు

న్యూఢిల్లీ, ముంబై, జైపూర్, మే 12: ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో.. ఈ నెల 3వ తేదీన నిర్వహించిన నీట్ (యూజీ)–2026 పరీక్షను 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' (ఎన్‌టీఏ) రద్దు చేసింది. వచ్చే వారం పది రోజుల్లో కొత్త పరీక్ష తేదీలను ప్రకటిస్తామని తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన జారీ చేసింది. కేంద్ర సంస్థల సమన్వయంతో తాము స్వయంగా ఈ వ్యవహారాన్ని పరిశీలించిన తర్వాత.. కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. పరీక్షను మళ్లీ నిర్వహించటం అనేక మంది విద్యార్థులకు, వారి కుటుంబాలకు ఇబ్బంది కలిగించే నిర్ణయమేనని, అయితే, పరీక్షల వ్యవస్థపై ఉన్న నమ్మకం వమ్ము కాకుండా కాపాడేందుకు ఈ నిర్ణయాన్ని తీసుకోవాల్సి వచ్చిందని వివరించింది. పరీక్ష కొత్త తేదీలను, కొత్త అడ్మిట్‌కార్డుల జారీ వివరాలను తమ అధికారిక చానళ్ల ద్వారా వెల్లడిస్తామని.. తాము జారీ చేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని, ఇతరత్రా ఊహాగానాలు నమ్మవద్దని సూచించింది. 'కొత్తగా పరీక్షకు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదు. అదనపు పరీక్ష ఫీజు కట్టాల్సిన పని లేదు. ఇప్పటికే ఫీజు చెల్లించిన వారికి రిఫండ్ చేస్తాం. కొత్తగా నిర్వహించే పరీక్షను మా అంతర్గత వనరులతోనే నిర్వహిస్తాం' అని స్పష్టం చేసింది. ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్‌సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. మే 3వ తేదీన జరిగిన పరీక్షలో నాలుగు సెట్‌ల ప్రశ్నాపత్రాలున్నాయని, వాటిలో మొత్తానికి మొత్తంగా ఏదీ లీకేజీ కాలేదని చెప్పారు. అయితే, బయట పంపిణీ అయిన ఓ కాపీలోని కొన్ని ప్రశ్నలు మాత్రం ప్రశ్నాపత్రాల్లో వచ్చాయని తెలిపారు. 'ఒక్క ప్రశ్న విషయంలో అలా జరిగినా కూడా అది మేం నిర్దేశించుకున్న ప్రమాణాలకు విఘాతం కలిగినట్లే. అందుకే మళ్లీ పరీక్ష జరపాలని నిర్ణయించాం' అని వివరించారు. ప్రస్తుత పరిణామంతో దేశంలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యావత్ వ్యవస్థ ప్రభావితమవుతోందన్నారు. తప్పు జరిగిందని, దానికి తాము బాధ్యత వహిస్తున్నామని చెప్పారు. మళ్లీ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహిస్తామన్నారు. విద్యార్థులను తప్పుదోవ పట్టించేవారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని అభిషేక్‌సింగ్ తెలిపారు.

**సీబీఐ దర్యాప్తు ప్రారంభం**

నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసి వివిధ రాష్ట్రాలకు పలు బృందాలను పంపించింది. ఇప్పటి వరకూ ఈ అంశంపై దర్యాప్తు జరిపిన రాజస్థాన్ పోలీసుల నుంచి వివరాలు సేకరించనుంది. అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో ఈ నెల 3వ తేదీన నీట్ (యూజీ)–2026 పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు 23 లక్షల మంది విద్యార్థులు నమోదు చేసుకోగా.. 96.92 శాతం మంది హాజరయ్యారు. పరీక్ష రద్దు నేపథ్యంలో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సిన దుస్థితి నెలకొంది. పేపర్ లీకేజీపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఎస్ఎ?ఫఐ, ఎన్ఎ?సయూఐ తదితర విద్యార్థి సంఘాలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. పరీక్షల నిర్వహణలో ఎన్‌టీఏ సామర్థ్యంపై విద్యార్థులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌టీఏ బదులు నీట్‌ను ఎయిమ్స్–ఢిల్లీ నిర్వహించాలన్న డిమాండ్ వ్యక్తమైంది. లీకేజీ ఘటనపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను విలేకరులు మంగళవారం ప్రశ్నించగా.. ఆయన స్పందించలేదు. కాగా, పేపర్ లీకేజీ వార్తలపై ఎన్‌టీఏ ఆదివారం ఎక్స్‌లో స్పందిస్తూ.. లీకేజీ అక్రమాల గురించి తమకు ఈ నెల 7వ తేదీ సాయంత్రం తెలిసిందని, దీనిపై స్వతంత్ర విచారణ కోసం మరుసటి రోజు ఉదయం కేంద్ర సంస్థలకు తాము తెలియజేశామని వెల్లడించింది.

**గెస్ పేపర్ పేరుతో లీకేజీ!**

పేపర్ లీకేజీ వ్యవహారం బయటపడటానికి ముందు ఓ గెస్ పేపర్ బయట చక్కర్లు కొట్టింది. దీంట్లో ఉన్న పలు ప్రశ్నలే.. నీట్ పరీక్షలో వచ్చాయి. దీంతో ఈ గెస్ పేపర్ ఎలా బయటకు వచ్చిందన్నదానిపై దర్యాప్తు అధికారులు దృష్టి పెట్టారు. లీకేజీ ఘటనకు కేంద్రబిందువుగా భావిస్తున్న రాజస్థాన్‌లో.. పోలీసుల 'స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్' (ఎస్‌ఓజీ) ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించింది. ఆ రాష్ట్ర అదనపు డీజీపీ విశాల్ బన్సాల్ మీడియాతో మాట్లాడుతూ, 'పరీక్ష జరగటానికి నెల రోజుల ముందు నుంచే ఈ గెస్ పేపర్ విద్యార్థుల్లో తిరుగుతోంది. దాంట్లో 410 ప్రశ్నలు ఉన్నాయి. వీటిలోంచి నీట్ కెమిస్ట్రీ పరీక్ష పేపర్ నాలుగు సెట్లకు సంబంధించి 120 ప్రశ్నలు యథాతథంగా వచ్చాయి. ఈ గెస్ పేపర్ ఎలా బయటకు వచ్చింది అన్న దాని మీద కేంద్రీకరించాం' అని తెలిపారు. కాగా, నీట్ పరీక్ష పత్రం మహారాష్ట్రలోని నాసిక్‌లో ప్రింట్ అవుతుందని, అక్కడి నుంచే పేపర్ లీకేజీ జరిగిందన్న సందేహాలున్నాయి. ఇది వాస్తవం కాదని, నాసిక్‌లో ప్రింటింగ్ జరగటం లేదన్నది మరో వాదన. పోలీసు వర్గాల ప్రకారం.. నాసిక్ నుంచి బయటకొచ్చిన పేపర్ హరియాణాలోని గురుగ్రాంకు చెందిన ఓ డాక్టర్ వద్దకు చేరింది. ఈ డాక్టర్ నుంచి రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఉండే ఓ వ్యక్తి వద్దకు వెళ్లింది. అక్కడి నుంచి అదే రాష్ట్రంలోని ప్రముఖ కోచింగ్ సెంటర్లకు నెలవైన సికార్‌లో ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఏజెంట్‌గా పని చేస్తున్న రాకేశ్ కుమార్ వద్దకు చేరుకుంది. ఇక్కడి నుంచి గెస్ పేపర్ పేరుతో పలు రాష్ట్రాల్లోని కోచింగ్ సెంటర్లకు వెళ్లింది. వీటిలో ఏపీ, తెలంగాణకు చెందినవి కూడా ఉన్నట్లు సమాచారం. ఈ గెస్ పేపర్‌ను రూ.30 వేల నుంచి కొన్ని లక్షల రూపాయల వరకు ధర పెట్టి అమ్మేశారు. కోచింగ్ తీసుకోవటానికి సికార్‌కు వచ్చిన నాగ్‌పూర్‌నకు చెందిన ఓ విద్యార్థి ఏకంగా రూ.28 లక్షలు చెల్లించి కొనుక్కున్నాడు. సాధారణంగా ఈ అక్రమాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతుంటాయి. అయితే, ఈసారి ఏజెంట్లు ఒకర్ని మించి మరొకరు సొమ్ము చేసుకునే ఉద్దేశంతో విచ్చలవిడిగా పేపర్‌ను అమ్మటంతో ఈ వ్యవహారం బయటపడింది.

## విజయ్ సంచలన నిర్ణయం.. తన కారు డ్రైవర్ కొడుక్కి ప్రభుత్వ చీఫ్ విప్ పదవి

-మొదటిపేజీ తరువాయి

విజయ్ తన పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) తరఫున టికెట్ ఇచ్చారు. చెన్నైలోని విరుగంబాక్కం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన శబరినాథన్ విజయం సాధించారు. తాజాగా ఆయన్ను ప్రభుత్వ చీఫ్ విప్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించారు.

ఈ నిర్ణయం ద్వారా తన ప్రభుత్వం సామాన్యులకు, విధేయతకు పెద్దపీట వేస్తుందనే స్పష్టమైన సంకేతాన్ని విజయ్ పంపినట్లు

రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ నియామకంపై సామాజిక మాధ్యమాల్లో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యుడికి ఉన్నత

పదవి దక్కడం అభినందనీయమని కొందరు ప్రశంసిస్తుండగా, ఎలాంటి అనుభవం లేని వ్యక్తికి ఇంత కీలకమైన శాసనసభా పదవిని కట్టబెట్టడం సరికాదని మరికొందరు విమర్శిస్తున్నారు. .

# జిల్లాకో సమస్య... వాటిపై ఎలుగెత్తుదాం

- మొదటి పేజి తరువాయి

సాంకేతిక నిపుణులతో శిక్షణ ఇప్పించాలి. మండలాలు, పురపాలికలకు ఐదుగురు నేతలతో సమన్వయ కమిటీలను రెండు, మూడు రోజుల్లో వేయాలి. సభ్యత్వ నమోదును పర్యవేక్షించేందుకు రాష్ట్రకమిటీ నుంచి అసెంబ్లీ నియోజకవర్గానికో సమన్వయకర్తను నియమించాలి. పల్లెలు, పట్టణ కమిటీలో నాయకుల బంధువులకు స్థానం లేదు. పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్న నాయకులకే పట్టం కట్టాలి.

సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మధుసూదనాచారి, కేటీఆర్, జీవన్‌రెడ్డి, సబితారెడ్డి, కె.ఆర్.సురేశ్‌రెడ్డి

బలంగా లేని నియోజకవర్గాలపై దృష్టి: రాష్ట్రంలోని కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ బలహీనంగా ఉన్నట్లు కనిపిస్తోంది. వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. అవసరమైతే ఆయా నియోజకవర్గాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించాలి. మండలం, జిల్లా, పురపాలికల స్థాయుల్లో కొత్త నేతలను తయారు చేయాలి. పార్టీలోకి బలమైన వర్గాలకు చెందిన ముఖ్యనేతలను ఆహ్వానించాలి. త్వరలో జిల్లాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షిస్తా.

పరిషత్, జీహెచ్ఎంసీ ఎన్నికలకు సిద్ధం: ప్రభుత్వం త్వరలో ప్రాదేశిక నియోజకవర్గాల(పరిషత్)కు, జీహెచ్ఎంసీ, వరంగల్, సిద్దిపేట, ఖమ్మం నగరపాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేయాలి. జీహెచ్ఎంసీలో మెజారిటీ డివిజన్‌లు గెలుపొందేలా వ్యూహాలను రచించాలి" అని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, జీవన్‌రెడ్డి, ఎస్.మధుసూదనాచారి, ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, టి.రవీందర్‌రావు, డా.పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డా.బండాప్రకాశ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, జోగినపల్లి సంతోష్‌కుమార్, వి.గంగాధర్‌గౌడ్, మహమూద్ అలీ, కేఆర్ సురేశ్‌రెడ్డి, సోమా భరత్‌కుమార్ పాల్గొన్నారు.

## నా కుమారుడు తప్పు చేస్తే శిక్ష పడాల్సిందే

- మొదటి పేజి తరువాయి

మంగళవారం నిర్వహించిన హిందూ ఏక్తా యాత్రలో ఆయన మాట్లాడారు. "సమాజమే నా కుటుంబమనుకుని రేయింబవళ్లు ప్రజల కోసం పాటుపడ్డా.. 150 రోజులు 1,600 కి.మీ. పాదయాత్ర చేసి అన్నివర్గాల ప్రజల కష్టనష్టాల్లో భాగమయ్యా. ప్రజలే నా కుటుంబమనుకున్నా. కానీ, నా కుటుంబానికి, నా కుమారుడికి సమయమివ్వకుండా పొరపాటు చేశా. తప్పు నాదే. ఎప్పుడూ మాట్లాడలేకపోయా. అందుకే సమాజానికి నేను క్షమాపణ చెబుతున్నా. సమాజం ముందు కుమారుడిని క్రిమినల్‌లా చూపిస్తే ఏ తండ్రికైనా బాధేస్తుంది. 'తప్పు చేయలేదు నాన్నా.. ఫ్రెండ్స్‌లాగా కలిసి ఉన్నాం. తరువాత విడిపోయాం.. నిజాయతీగా బయటికొస్తా' అని నా బిడ్డ నాతో చెప్పాడు. నేను అతడిని సమర్థించట్లేదు. తప్పు ఎవరు చేసినా తప్పే.. నా బిడ్డకు ఒక న్యాయం, ఇతరులకు ఇంకో న్యాయం అంటూ ఉండదు. అతడు నిజంగా తప్పు చేస్తే శిక్షను ఎదుర్కోవాల్సిందే. ఈ రోజు నా భార్య కూడా నా దారిలో నడుస్తున్నారు. బ్యాంకు ఉద్యోగానికి సెలవు పెట్టి ఇంట్లో ఉంటూ నన్ను నమ్మిన కార్యకర్తలకు సహాయం చేస్తున్నారు. ఇప్పుడు ఆ కన్నపేగు డిప్రెషన్‌లోకి పోతోంది.. విలపిస్తోంది. కుటుంబంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడి చేస్తుంటే ఏ కన్నతల్లి మాత్రం భరించగలదో ఆలోచించండి. బండి సంజయ్ భయపడే వ్యక్తి కాదు. రాముడంతటి దేవుడికే కష్టమొచ్చింది. తరువాత ఆదర్శ రాముడిగా నిరూపించుకున్నాడు. నా జీవితంలో ఎన్నో కష్టాలు పడ్డాను. సామాన్య కార్యకర్తగా జెండాలు కట్టిన నేను ఈ రోజు ఈ స్థాయిలో నిలబడ్డాను. నా భుజం మీద కాషాయ జెండా.. నా శిరసుపై అమ్మవారి ఆశీస్సులున్నాయి. నన్ను ఈరోజు కొందరు లక్ష్యంగా చేసుకుంటున్నారు. వారికి చెబుతున్నా. మీరు పెట్టిన నిప్పుతోనే మీ భరతంపడతా. ఆంజనేయ స్వామి లంకను కాల్చినట్టు.. తెలంగాణలో దళారుల వ్యవస్థను, కుటుంబ పాలన వ్యవస్థను, అవినీతి వ్యవస్థను పక్కాగా దహనం చేస్తా. ఎవరైతే కుట్రలు, కుతంత్రాలు చేస్తూ.. నా కుటుంబాన్ని బజారుకీడ్చారో.. నా కార్యకర్తల్లో ఆవేదనను రగిల్చారో.. నా పార్టీని ఇబ్బందుల్లో పెట్టారో.. వారిలో ఏ ఒక్కరినీ నేను విడిచిపెట్టే ప్రసక్తి లేదు. భారాస హయాంలో 29 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు..

## నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టుల రహస్య స్థావరం గుర్తింపు

ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టుల రహస్య స్థావరాన్ని భద్రతా బలగాలు గుర్తించాయి. 'మాద్ బచావో అభియాన్' కింద డీఆర్జీ, ఎస్‌టీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ సంయుక్తంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భారీగా నగదు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, నిత్యావసర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. రూ.1.64 కోట్ల నగదు, మూడు ఏకే–47 రైఫిళ్లు, మూడు ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, రెండు నాటు తుపాకులు సహా భారీగా ఇతర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. వందలాది తూటాలు, మ్యాగజైన్‌లు, ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, కార్డెక్స్ వైర్, వాకీ టాకీ సెట్లు లభ్యమయ్యాయి. మావోయిస్టు రహిత జిల్లాగా తయారు చేసేందుకు ఇలాంటి ఆపరేషన్లు కొనసాగుతాయని ఎస్పీ స్పష్టం చేశారు.

## మళ్లీ దాడి చేస్తే అణు యుద్ధమే!?

టెహ్రాన్, మే 12: అమెరికా లేదా ఇజ్రాయెల్ దళాలు తమపై మరోసారి దాడిచేస్తే.. తమ యురేనియం నిల్వలను అణ్వాయుధాల తయారీకి అవసరమైన 90% స్థాయికి శుద్ధిచేసే ప్రక్రియ చేపడతామని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై సరికొత్త సైనిక చర్య చేపట్టే అంశాన్ని పరిశీలిస్తున్నారని మీడియాలో కథనాలు వెలువడుతున్న నేపథ్యంలో ఈ హెచ్చరిక చేసింది. ఇరాన్ పార్లమెంటరీ కమిషన్ ప్రతినిధి ఇబ్రహీం రెజాయి.. ఎక్స్ వేదికగా ఈ హెచ్చరిక చేశారు. ఇరాన్‌ను అణ్వాయుధాలు తయారు చేయడానికి తాము ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని ట్రంప్ ఇప్పటికే పలుమార్లు చెప్పారు. ఇదిలా ఉండగా. న్యూయార్క్ టైమ్స్ నివేదిక ప్రకారం... ఇరాన్ గత ఎనిమిదేళ్లలో దాదాపు 11,000 కిలోల అధిక స్థాయి యురేనియంను సమకూర్చుకుంది. 2006లోనే యురేనియంను సమకూర్చుకునే ప్రక్రియను ప్రారంభించిన ఇరాన్.. సంవత్సరాలు గడిచేకొద్దీ నిల్వ పెంచుకుంటూ పోతున్నట్టు తెలిపింది. అయితే ఇరాన్ దీన్ని ఎక్కడ దాచిందనేది మాత్రం ఇప్పటికీ అంతుచిక్కని రహస్యంగానే ఉంది. ఇరాన్ సమకూర్చుకున్న యురేనియంలో అధిక భాగం ఇప్పటికీ ఇస్ఫహాన్ అణు కేంద్రంలోనే ఉందని ఐక్యరాజ్య సమితికి చెందిన అణు పర్యవేక్షణ సంస్థ, అంతర్జాతీయ అణుశక్తి ఏజెన్సీ (ఐఏఈఏ) భావిస్తోంది.

## 'ఏపీ, తెలంగాణ అవసరాల మేరకు కృష్ణా జలాలను వినియోగించుకోవాలి'

-మొదటిపేజీ తరువాయి

ఆగస్టు 15 వరకు ఏపీకి 10 టీఎంసీల వినియోగానికి కేఆర్ఎంబీ అనుమతించింది. తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి 6 టీఎంసీల వినియోగానికి అంగీకారం తెలిపింది. ఏపీ ఇప్పటికే ఎక్కువ నీరు వాడుకుందని సమావేశంలో తెలంగాణ అధికారులు కేఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లారు.

## పెట్రోల్, డీజిల్ లభ్యత, ధరలపై కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు

-మొదటిపేజీ తరువాయి

పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంక్షోభం ఎక్కువ కాలం కొనసాగితే ఆ భారాన్ని దేశీయ వినియోగదారులపై మోపే పరిస్థితి రావొచ్చని అభిప్రాయపడ్డారు. దేశంలో చమురు సరఫరాపై ఆందోళన వ్యక్తమవుతున్న క్రమంలో హర్దీప్ సింగ్ పూరి స్పందించారు. చమురు సరఫరాలో ఇబ్బందులేమీ లేవని హామీ ఇచ్చారు. దేశంలో తగినన్ని చమురు నిల్వలున్నాయని వెల్లడించారు. దేశంలో ప్రస్తుతం 69 రోజులకు సరిపడే క్రూడాయిల్, ఎల్ఎన్‌జీ నిల్వలు ఉన్నాయని అన్నారు. 45 రోజులకు సరిపడా ఎల్పీజీ స్టాక్ ఉందని స్పష్టం చేశారు. ఎల్పీజీ ఉత్పత్తిని దేశంలో గణనీయంగా పెంచినట్లు తెలిపారు. రోజుకు 35,000 టన్నుల నుంచి 50,000 టన్నుల వరకు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచామని అన్నారు. ప్రస్తుత పశ్చిమాసియా యుద్ధం వల్ల తలెత్తిన సంక్షోభాన్ని సమర్థవంతంగా, బాధ్యతగా ఎదుర్కొన్నామని అన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన సలహా ప్రజలను అప్రమత్తం చేయడానికేనని తెలిపారు. దేశంపై ఆర్థికభారం పడకుండా ఆయన ఈ సూచన చేశారని తెలిపారు.

## 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో దశ షురూ

- మొదటి పేజి తరువాయి

ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. "గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్‌కు 20–30 కిలోమీటర్ల దూరంలో రెండు పడక గదుల ఇళ్లను నిర్మించి, నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించింది. వారి జీవనోపాధిపై ప్రభావం పడటంతో లబ్ధిదారులు అక్కడ ఉండేందుకు నిరాకరిస్తున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైంది. అలాంటి తప్పు పునరావృతం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5–8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తాం. ఇందుకోసం నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని... ప్రభుత్వ, భూదాన్ భూములు, మురికివాడలు, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిథిలావస్థకు చేరిన ప్రాంతాలను గుర్తించాలి. ప్రతిపాదనల రూపకల్పన క్రతువులో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలి.

**హైదరాబాద్ పరిధిలో స్థలముంటే ఇందిరమ్మ ఇల్లు**

హైదరాబాద్ పరిధిలో స్థలాలున్న అర్హులకు ఈ నెలాఖరులోగా అధికారులు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలి. రెండు పడక గదుల ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. ఆయా కాలనీలకు 5–8 కి.మీ. దూరంలో ఉన్న వారినే ఎంపిక చేయాలి. జిల్లా హౌసింగ్ పీడీలు తమ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీలను సందర్శించాలి" అని ఆదేశించారు.

హైదరాబాద్ జిల్లా సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రులు అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు

**ఆ సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోండి...**

మల్కాజిగిరి నియోజకవర్గంలో యూఎల్‌సీ భూములు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా కొంతభాగాన్ని రిజిస్ట్రేషన్ చేశారని స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి వెంటనే సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

## రైల్ రోకో కేసులో కవితకు సమన్లు... సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు హాజరు కావాలని ఆదేశాలు...

- మొదటి పేజి తరువాయి

కేసులు నమోదయ్యాయి. రైల్వే యాక్ట్ 147 ఉ 74(ఖ) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. రైల్ రోకోలో భాగంగా దేవగిరి ఎక్స్‌ప్రెస్ తో పాటు గూడ్స్ రైలు నిలిపేశారు కవిత. దీంతో నిజామాబాద్--హైదరాబాద్ రూట్‌లో అంతరాయం ఏర్పడింది. రైల్వే ఏఎస్ఐ రవీంద్రబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు పోలీసులు. అయితే.. ఈ కేసు విచారణలో భాగంగా సికింద్రాబాద్ కోర్టుకు కవిత హాజరవుతారా లేదా అన్నది ఉత్కంఠగా మారింది. ఈ కేసుకు సంబంధించి విచారణ సందర్భంగా కోర్టు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని పొలిటికల్ సర్కిల్స్ లో చర్చ జరుగుతోంది. బీసీ రిజర్వేషన్ల అంశం తెలంగాణ పాలిటిక్స్ లో కీలకంగా మారిన క్రమంలో ఈ కేసు ప్రాధాన్యత సంతరించుకుంది.

## విద్యార్థుల సృజనాత్మకతకు ప్రోత్సాహం

- క్రమశిక్షణతోనే ఉన్నత లక్ష్యాలు సాధ్యం: ఎస్సై సంధ్య
- విద్యతోపాటు కలలోను రాణించాలని విద్యార్థులకు సూచన




**న్యూస్ ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు మే 12 2026:** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా ఖమ్మం జిల్లా ఏన్కూరులోని ం+=ూ ది జీజ లో విద్యార్థులలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ఆర్ట్, క్రాఫ్ట్ మరియు సాంస్కృతిక పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. చిత్రలేఖనం, చేతిపనులు, నృత్యాలు, గాన ప్రదర్శనలు తదితర విభాగాలలో విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు రూపొందించిన కళాఖండాలు, క్రాఫ్ట్ నమూనాలు సభికులను ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏన్కూరు పోలీస్ స్టేషన్ సబ్ఇన్స్పెక్టర్ ఎన్ సంధ్య మాట్లాడుతూ విద్యార్థి దశలోనే కళలు, సంస్కృతి, సృజనాత్మక కార్యక్రమాల పట్ల ఆసక్తి పెంపొందించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యతో పాటు సాంస్కృతిక, కళారంగాలలోనూ రాణించడం ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదల, కృషితో ముందుకు సాగితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని అన్నారు. అనంతరం పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతలను అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు. విద్యార్థుల కళా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## మెడికల్ కాలేజీ ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే
## జిల్లా కలెక్టర్ వైద్య వృత్తిని దైవంగా భావిస్తేనే ఉన్నతంగా రాణిస్తారు...

**సీకే న్యూస్ జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి బోయ కిష్టన్న.** ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదివి పేద ప్రజలకు సేవలు అందించాలి.

త్వరలోనే మెడికల్ కాలేజీ నూతన భవనం ప్రారంభిస్తాం. నిన్న రాత్రి గద్వాల జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీ నందు మెడికల్ కాలేజీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా హాజరయ్యారు..ఎమ్మెల్యే కి, జిల్లా కలెక్టర్ కి కళాశాల వైస్ ప్రిన్సిపల్ కళాశాల విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యేకి జిల్లా కలెక్టర్ కి కళాశాల ప్రిన్సిపాల్ లెక్చరర్స్ శాలువా కప్పి మెమొంటో ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మెడికల్ కాలేజీ విద్యార్థులకు క్రికెట్ కిట్టును, డిజె సౌండ్ బాక్స్ ను అందజేశారు. స్పెషల్ డే సందర్భంగా నిర్వహించిన సంస్కృతి కార్యక్రమాలు వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా మెమోటోలను పంపిణీ చేశారు. విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే నృత్యం చేశారు. విద్యార్థులు నిర్వహించిన సంస్కృత కార్యక్రమాలను ఎమ్మెల్యే కలెక్టర్ తిలకించారు

ఎమ్మెల్యే మాట్లాడుతూ. మెడికల్ కాలేజీ నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ప్రతి ఒక్కరికి హార్దిక శు భాకాంక్షలు. మెడికల్ కళాశాలలో సీటు సంపాదించాలంటే ఎంతో కష్టపడాలి విద్యార్థులు గతంలో ఉమ్మడి రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు తక్కువగా ఉండేది తెలంగాణ రాష్ట్ర వేదుపడిన తర్వాతనే ప్రతి జిల్లాలో గత ప్రభుత్వం మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడం జరిగింది. గద్వాల కూడా మెడికల్ కాలేజీలు మంజూరు చేయాలని కృషిచేసి గద్వాలకు మెడికల్ కాలేజీలు తీసుకురావడం జరిగిందని తెలిపారు. మెడికల్ కాలేజీ లో చదివే విద్యార్థులు ప్రతిరోజు సుమారు 12 గంటల నుండి 15 గంటల వరకు చదవాలి అన్నారు. ప్రజలకు సేవ చేయాలని దృఢమైన సంకల్పంతో మెడికల్ వైద్య వృత్తిలోకి శిక్షణ పొంది భవిష్యత్తులో వైద్యులుగా పేద ప్రజలకు మెరుగైన చికిత్సను అందించాలి అని తెలిపారు.

మెడికల్ కాలేజీ నిర్మాణం పనులు ప్రారంభం కావడం జరిగింది త్వరలోనే అన్ని హంగులతో ఎలాంటి ఇబ్బంది లేకుండా మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి కావడం జరుగుతుందని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి మెడికల్ కాలేజీలో 100 మంది విద్యార్థులు అడ్మిషన్ అయ్యేవిధంగా చూడాలని విద్యార్థులు కోరారు వాటిని వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కృషి చేస్తానని తెలిపారు.

గద్వాల మెడికల్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన సేవలు అందించి మీ తల్లిదండ్రులకు గద్వాల ప్రాంతానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. మెడికల్ కాలేజీ విద్యార్థులకు ఎల్లప్పుడూ నా సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. మెడికల్ కాలేజీలో మొట్టమొదటిసారిగా ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్ చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చిట్ట చివరి ప్రాంతమైన జోగులాంబ గద్వాల జిల్లా గద్వాలలో మెడికల్ కాలేజీ రావడానికి ఎమ్మెల్యే ఎంతో కృషి చేసి గద్వాలలో కూడా మెడికల్ కాలేజీ నర్సింగ్ కాలేజీ తీసుకురావడానికి కృషి చేసిన ఎమ్మెల్యేకి ప్రత్యేక ధన్యవాదాలు..



ఈ మెడికల్ కాలేజీలు చెబుతున్న విద్యార్థులకు కొన్ని సమస్యలు ఉంటాయి వాటిని పరిష్కరించడం ముందుకు వెళ్లాలి కొత్త జిల్లాలలో మెడికల్ కాలేజీ కొత్తగా ఏర్పాటు కావడం జరిగింది త్వరలోనే వాటిని అన్ని రంగులతో అన్ని రకాల సౌకర్యాలతో ప్రభుత్వం ఏర్పాటు చేసి భవిష్యత్తులో మెడికల్ కాలేజీ అన్ని రకాల సౌకర్యాలకు విద్యార్థులకు ఉండే విధంగా ప్రభుత్వం కృషి చేసే విధంగా జరుగుతుందని తెలిపారు. మెడికల్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు భవిష్యత్తులో గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎల్లప్పుడూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవలను అందించాలని కోరారు. గద్వాల ప్రాంతంలోని మెడికల్ కళాశాల చదువుకున్న విద్యార్థులు గద్వాల ప్రాంతం లోని ప్రజలకు మెరుగైన సేవలు అందించి అదేవిధంగా గద్వాల ప్రాంతానికి మీ తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని కోరారు..

మెడికల్ కాలేజీలో ఎటువంటి సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకోరండి వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించే విధంగా నా వంతు ప్రయత్నిస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరెంట్, జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, జీ వేణుగోపాల్, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా డీసీసీ మెడికల్ అండ్ హెల్త్ చైర్మన్ డాక్టర్ నర్సింగ్ రావు, మాజీ కౌన్సిలర్ మురళి నరహరి శ్రీనివాసులు, నాయకులు గోవిందు,సాయి శ్యామ్ రెడ్డి, వంట భాస్కర్, బంగి సుదర్శన్, మధు, నరేందర్ రెడ్డి, కొత్త గణేష్, మెడికల్ కాలేజీ వైట్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, మెడికల్ కాలేజీ లెక్చరర్స్ ఫ్యాకల్టీ, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గద్వాల పట్టణ ప్రజల ట్రాఫిక్ ను దృష్టిలో ఉంచుకొని ఫుట్ పాతుల పై అక్రమంగా ఏర్పాటు చేసుకున్న వాటిని తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు...




**సీకే న్యూస్ జోగులాంబ గద్వాల జిల్లా బోయ కిష్టన్న.** ట్రాఫిక్ పోలీసులు జోగులాంబ గద్వాల జిల్లా: గద్వాల ప్రజలకు అంతరాయం కలగకుండగా ట్రాఫిక్ ను దృష్టిలో పెట్టుకొని మున్సిపాలిటీ స్థలాల్లో ఫుట్పాతులపై అక్రమంగా ఏర్పాటు చేసుకున్న డబ్బాలను తొలగిస్తున్నట్లు మున్సిపల్ అధికారుల, ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణలో ఇట్టి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గద్వాల పట్టణ ప్రజల సేఫ్టీని దృష్టిలో పెట్టుకుని ఫుట్ పాతులపై ఏర్పాటు చేసుకున్న వివిధ రకాల డబ్బాల వల్ల ప్రజలకు ఎలాంటి ఆ సౌకర్యం కలగకుండా (వాహనాల రద్దీ విషయంలో గానీ కాలనీవాసులు నడిచి వెళ్లే విషయంలో గాని) ఉండేందుకే వాటిని తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు మరియు గద్వాల జిల్లా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు ఆధ్వర్యంలో డబ్బాలను తొలగించడం జరుగుతుంది.

## ఎమ్మెల్యే ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎల్లందొడ్డి సర్పంచ్ సుజాత నరసింహులు...

**సికే న్యూస్ జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి బోయ కిష్టన్న.** ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందు గట్టు మండలం పరిధిలోని ఎల్లందొడ్డి గ్రామ సర్పంచ్ సుజాత నరసింహులు ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వక కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, ౹ాజా చైర్మెన్ వెంకటేష్, సీనియర్ నాయకులు రామకృష్ణ రెడ్డి, నాయకులు తిమ్మప్ప, సోమన్న, హనుమంతు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణం లోని 7వ వార్డు పిల్లిగుండ్ల కాలనీలో నిర్మించుకున్న గృహాలను తక్షణమే మున్సిపల్ ఆన్లైన్ రికార్డుల్లో నమోదు చేసి ఇంటి నెంబర్లు కేటాయించాలి.



**సీకే న్యూస్ జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి బోయ కిష్టన్న.** మున్సిపాలిటీకి పట్టనీ పిల్లిగుండ్ల కాలనీ గద్వాల పట్టణంలోని 7వ వార్డు పిల్లిగుండ్ల కాలనీలో ఇప్పటికే దాదాపు 500కు పైగా గృహాలు పూర్తిగా నిర్మించుకొని ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా నివాసం ఉంటున్నప్పటికీ, ఇప్పటి వరకు ఆయా గృహాలను మున్సిపల్ అధికారుల ద్వారా ఆన్లైన్ రికార్డుల్లో నమోదు చేయకపోవడం, ఇంటి నెంబర్లు కేటాయించకపోవడం స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.

ఇంటి నెంబర్లు లేకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడంలో, బ్యాంకు సేవలు వినియోగించుకోవడంలో, ఆధార్ చిరునామా మార్పులు చేయించుకోవడంలో, విద్యుత్ మరియు తాగునీటి కనెక్షన్లు పొందడంలో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా అత్యవసర సేవలు కూడా కాలనీలోని ఇళ్లను గుర్తించడంలో ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలనీలో ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు నివాసం ఉంటున్నప్పటికీ, తమ గృహాలకు అధికారిక మున్సిపల్ గుర్తింపు లేకపోవడం బాధాకరమని వారు చెబుతున్నారు. ఇంటి నెంబర్లు లేకపోవడంతో ఇంటి పన్నులు కూడా చెల్లించలేకపోతున్నామని, భవిష్యత్తులో మరిన్ని పరిపాలనా సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఈ నేపథ్యంలో గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గద్వాల మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు మరియు 7వ వార్డు కౌన్సిలర్ తక్షణమే స్పందించి పిల్లిగుండ్ల కాలనీలో నిర్మించుకున్న అన్ని గృహాలను వెంటనే మున్సిపల్ రికార్డుల్లో ఆన్లైన్లో నమోదు చేసి, ప్రతి ఇంటికి ప్రత్యేక ఇంటి నెంబర్లు కేటాయించాలని, ఇంటి పన్నులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. అలాగే పిల్లిగుండ్ల కాలనీకి పూర్తి స్థాయి మున్సిపల్ గుర్తింపు కల్పించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి, తక్షణ చర్యలు చేపట్టి పిల్లిగుండ్ల కాలనీలోని గృహాలను మున్సిపల్ ఆన్లైన్ రికార్డుల్లో నమోదు చేసి ఇంటి నెంబర్లు కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అంతేగాక నేటి నుండి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న జనగణన లో పెల్లి గుండ్ల కాలనీవాసులు నమోదు చేసుకునే అర్హత లేదా అని కాలనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## తెలంగాణ రాష్ట్ర శాసనసభ -స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ ని మర్యాదపూర్వకంగా కలిసిన సరిత తిరుపతయ్య...

**సికే న్యూస్ జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి బోయ కిష్టన్న.** ఈరోజు హైదరాబాద్లోని మినిస్టర్ క్వార్టర్స్లో రాష్ట్ర శాసనసభ స్పీకర్ గౌరవనీయులు శ్రీగడ్డం ప్రసాద్ ని, జెడ్పీ మాజీ చైర్పర్సన్ మరియు గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్రీమతి సరిత తిరుపతయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.

?తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమాఖ్ చైర్మన్గా తనను నియమించినందుకు గాను, ఈ సందర్భంగా స్పీకర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకంతో ఇంతటి కీలక బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డికి మరియు పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

?గద్వాల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేయడంతో పాటు, సమాఖ్య ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కులవృత్తిదారుల సంక్షేమానికి శాయశక్తులా కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. త్వరలోనే బాధ్యతలు స్వీకరించి ప్రజా సేవలో నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు.



## అయిజ మున్సిపాలిటీలో 5వ వార్డు పర్దిపురం లో హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన భజన పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా..




**సి కె న్యూస్ జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి బోయ కిష్టన్న.** హాజరైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి ఆచారి హాజరై భజన పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తి వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా ఉంది అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఎస్. మద్దిలేటి యుగేందర్ మైనర్ బాబు మహబూబ్ పాషా జిల్లా లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సురేష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాండురంగ మాల మల్లికార్జున్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ముగ్గురికి జైలు శిక్ష

**సి కె న్యూస్** ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని వెహికల్ చెకింగ్ లో భాగంగా గత వారం రోజుల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వ్యక్తులని బోత్ కోర్టుకు తరలించగా బోత్ కోర్టు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ అయిన సందీప్ గారు

20 మందికి 1000/- చొప్పున 20,000/- జరిమానా విధించుతూ ముగ్గురికి జైలు శిక్ష విధించనైనది

# మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆత్మీయ సభను విజయవంతం చేయండి

**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నాగండ్ల దీపక్ చౌదరి, పువ్వాళ్ల దుర్గాప్రసాద్**



సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంత్రి పదవి చేపట్టి 40 ఏళ్ళు పూర్తవుతున్న సందర్భంగా నేడు సాయంత్రం 05.00 గంటలకు ఖమ్మం నగరం లోని ఎస్ ఆర్ అండ్ బీ జీ ఎన్ ఆర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారి ఆత్మీయ సభను విజయవంతం చేయాలని జిల్లా శ్రేణులనుకోరారు. అదే విధంగా వారు అభివృద్ధికి మారు పేరు అని కొనియాడారు. అనంతరం నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ జీవితంలో ప్రజాసేవ,అభివృద్ధి , రైతు సంక్షేమం కోసం కృషి చేశారని వారి ఆత్మీయ సభను విజయవంతం చేయాలని నగర కాంగ్రెస్ శ్రేణులను కోరారు.

అనంతరం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ దురంధరుడని,40 ఏళ్ళ రాజకీయ ప్రస్థానంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని అభివృద్దే ధ్యేయంగా పనిచేసిన అలుపెరుగని యోధుడని కావున ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జిల్లా రైతు కన్వీనర్ నల్లమల వేంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా లు మాట్లాడుతూ రేపటి తుమ్మల నాగేశ్వరరావు ఆత్మీయ సభను విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఏ ఐ సి సి సేవాదళ్ కో ఆర్డినేటర్ చోటా బాబా, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భానోత్ బాలాజీ నాయక్,జిల్లా ఐ యన్ టి యు సి అధ్యక్షులు కొత్తా సీతారాములు, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, జిల్లా ఎస్ సి సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి మూడుముంతల గంగరాజు యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, మాజీ కౌన్సిలర్ నగర కాంగ్రెస్ కమిటి సభ్యులు పాలకుర్తి నాగేశ్వరరావు, నగర ఓబీసీ సెల్ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, నగర కాంగ్రెస్ కమిటి సభ్యులు కోసూరి ప్రసాద్, సంపటం నరసింహారావు, నాగటి చంద్రశేఖర్ , కోనేటి నారాయణ, నగర కాంగ్రెస్ నాయకులు ప్రతిభారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## తాసిల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన, డీఆర్వో



మే 12 (సీ కే న్యూస్) చేగుంట :చేగుంట ఎమ్మార్వో కార్యాలయాని మెదక్ జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వర్ పరిశీలించి, తాసిల్దార్ కార్యాలయంలో కొనసాగుతున పనులపైన సమీక్ష నిర్వహించారు,వారి కార్యాలయ సిబ్బందికి పలు పనులపై కీలక ఆదేశాలు జారీ చేశారు, ముఖ్యంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రక్రియను వేగవంతం చేయాలని వారు తెలిపారు, ముఖ్యంగా పెండింగ్ లో ఉన్న భూభారతి దరఖాస్తులను త్వర త్వరగా పరిష్కరించాలని, అలాగే సాదా బైనమాలు పనులను కూడా వేగవంతం చేయాలని వారు తెలిపారు, కార్యక్రమంలో చేగుంట ఎమ్మార్వో శివప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు,

# రైతు కష్టానికి గిట్టుబాటు ఎక్కడ..?

- ఏన్కూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్లక్ష్యం
- ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్లక్ష్యంతో నష్టాల్లో రైతాంగం
- ప్రారంభోత్సవ హడావుడి తర్వాత కేంద్రాలు నిర్లక్ష్యానికి గురి







న్యూస్ ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు మే 12 2026: ఏన్కూరుతో పాటు పరిసర ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట చేతికొచ్చినా సరైన సమయంలో ధాన్యం కొనుగోళ్లు జరగక రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం రైతులకు ఆ ధర అందడం లేదని వాపోతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభించినప్పటికీ కొనుగోళ్లు మాత్రం జరగకపోవడంతో రైతులు తమ పంటను రోడ్లపైనే, గోదాముల దగ్గరే నిల్వ ఉంచాల్సి వస్తోంది. రోజులు గడుస్తున్నా అధికారులు, మిల్లర్లు సరైన స్పందన ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎండలు, అకాల వర్షాలు, గాలిదుమ్ము కారణంగా ధాన్యం తడిసి నాణ్యత కోల్పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిల్లర్లు, వ్యాపారులు కలిసి రైతులను దోచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తరుగు పేరుతో ఒక్కో క్వింటాకు 8 నుంచి 10 కిలోల వరకు కోతలు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. తూకాల్లో తేడాలు చూపించడం, తేమ ఎక్కువగా ఉందని చెప్పి ధర తగ్గించడం, నాసిరకం ధాన్యమంటూ అదనపు కోతలు విధించడం వల్ల రైతులకు భారీ నష్టం జరుగుతోందని చెబుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సరైన సదుపాయాలు లేక రైతులు రోజులు తరబడి వేచి చూడాల్సి వస్తోంది. గన్నీ సంచులు, తూకం యంత్రాలు, హమాలీలు సరిపడా లేకపోవడంతో లోడింగ్, అన్‌లోడింగ్ పనులు ఆలస్యమవుతున్నాయి. ట్రాక్టర్లు, లారీలు క్యూల్లో నిలిచిపోవడంతో రవాణా ఖర్చులు కూడా రైతులపై అదనపు భారంగా మారుతున్నాయి.

కొనుగోలు చేసిన తర్వాత కూడా రైతులకు డబ్బులు వెంటనే చెల్లించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారాలు గడిచినా బిల్లులు క్లియర్ కాక రైతులు అప్పుల కోసం తిరగాల్సిన పరిస్థితి వస్తోందని చెబుతున్నారు. బ్యాంకు రుణాలు, ప్రైవేట్ అప్పులు, పెట్టుబడి ఖర్చులు తీర్చలేక రైతులు తీవ్ర ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారు.

మండల వ్యవసాయ శాఖ అధికారులు, సివిల్ సప్లై అధికారులు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో మిల్లర్ల అక్రమాలు కొనసాగుతున్నాయని అంటున్నారు.

ఇదిలా ఉండగా, ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం రోజున అధికారులు, ప్రజాప్రతినిధుల హడావుడితో సందడి చేసిన కేంద్రాలు... ఆ తర్వాత పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని రైతులు విమర్శిస్తున్నారు. ప్రారంభం రోజు ఏర్పాటు చేసిన అధికారుల టెంట్లు సైతం ఇప్పుడు పడిపోయి ఉన్నా పట్టించుకునే నాధుడు లేకపోవడం కేంద్రాల దుస్థితికి అద్దం పడుతోందని అంటున్నారు.

“ఓపెనింగ్ రోజు ఫోటోలు, హడావుడి వరకే పరిమితమైన అధికారులు... ఇప్పుడు కేంద్రాల వైపు కన్నెత్తి చూడడం లేదు” అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండగా, పడిపోయిన టెంట్లు కూడా అక్కడి అధికారుల పనితీరుకు నిదర్శనంగా కనిపిస్తున్నాయని రైతులు ఎద్దేవా చేస్తున్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, మద్దతు ధర పూర్తిస్థాయిలో అమలు చేయాలని, తరుగు దోపిడీని అరికట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## హనుమాన్ జయంతి పర్వదినం భక్తిశ్రద్ధల సమాహారం.

- సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం మన బాధ్యత.
- అన్నప్రసాద వితరణ గొప్ప సేవా కార్యక్రమం.
- సేవా దృక్పథంతోనే సమాజంలో మార్పు సాధ్యం.
- ఆధ్యాత్మికతతో పాటు సామాజిక బాధ్యత అవసరం.
- సకల జనులకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు.
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే 12, హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం నియోజకవర్గ పరిధిలోని పలు దేవాలయాలను కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు, ఆలయ కమిటీలు ఏర్పాటు చేసిన అన్నప్రసాద పంపిణి కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, హేమచంద్రపురం సర్పంచ్ అంజలి,నాయకులు మొహమ్మద్ యూసుఫ్, బోయిన విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పథకం అమలులో ప్రభుత్వం విఫలం.

- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 12, ప్రజా దాహార్తిని తీర్చేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. మంగళవారం కొత్తగూడెం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్ డబ్ల్యు ఎస్ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ఓవర్ హెడ్ ట్యాంకులు, రిజర్వాయర్లు, పైపులైన్ల నిర్మాణం, బోర్ల తవ్వకం పనుల పురోగతిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. పనుల్లో జరుగుతున్న నిర్లక్ష్యంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల తాగునీటి అవసరాల కోసం నిధులు మంజూరు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వ తీరు ఏమాత్రం ఆశాజనకంగా లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమని చెప్పుకుంటున్న మిషన్ భగీరథ పథకం క్షేత్రస్థాయిలో విఫలమైందని, పనుల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. నిధుల మంజూరు విషయంలో ప్రభుత్వం చూపుతున్న వివక్షను ఆయన నిలదీశారు. నీటి సమస్య పరిష్కారం కోసం తాను అందించిన ప్రతిపాదనలను ప్రభుత్వం పక్కన పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవి దృష్ట్యా ప్రజలు అల్లాడకుండా నిరంతరం నీటి సరఫరా జరిగేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. నిధుల కోసం ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తామని, అయితే ఉన్న వనరులతో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో అధికారులు తిరుమలేశ్, శివయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే 12,రాష్ట్రంలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, సీతక్క, ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా ముఖ్య మంత్రి మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కొనుగోలు కేంద్రాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గన్ని బ్యాగులు, హమాలీలు, తూకం యంత్రాలు తదితర అవసరమైన సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలని, రవాణాకు అవసరమైన లారీలను అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఒప్పందం మేరకు వాహనాలు సమకూర్చని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు.

అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. గోదాముల కొరత ఉన్న ప్రాంతాల్లో రైతు బజార్లు, ఫంక్షన్ హాల్స్ తదితర భవనాలను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని సూచించారు.

మొక్కజొన్న పంట అధికంగా పండే జిల్లాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. అవసరమైన చోట పోలీస్ శాఖ సహకారంతో కొనుగోలు ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని సూచించారు.

ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో ఎక్కడైనా సమస్యలు తలెత్తినా పూర్తి బాధ్యత సంబంధిత జిల్లా కలెక్టర్లదేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కొనుగోళ్ల పురోగతిపై ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదికలు పంపించాలని ఆదేశించారు.

- **క్షేత్రస్థాయిలో పర్యటించి కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షించాలి.**
- **ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు తలెత్తితే పూర్తి బాధ్యత కలెక్టర్లదే.**
- **గన్ని బ్యాగులు, హమాలీలు, రవాణా సదుపాయాలు అందుబాటులో ఉంచాలి.**
- **ఒప్పందం మేరకు వాహనాలు సమకూర్చని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు.**
- **జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.**

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం, ఇబ్బందులు తలెత్తకుండా ఇకముందు ప్రతి కొనుగోలు కేంద్రానికి ప్రత్యేక అధికారులను నియమించి తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి కి తెలిపారు . గన్ని బ్యాగులు, హమాలీలు, రవాణా వాహనాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించేలా ప్రత్యేక ప్రణాళికతో వ్యవహరిస్తున్నామని చెప్పారు.

అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపడుతున్నామని, అవసరమైన చోట తాత్కాలిక నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ధాన్యం, మొక్కజొన్న సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తామన్నారు .

ఈ వీడియో కాన్ఫరెన్స్ కు అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణఖేడ్ మైనారిటీస్ గురుకులంలో ఘనంగా 5వ తరగతి లక్కీ డిప్ కార్యక్రమం -- టాపర్స్‌కు సన్మానం, అడ్మిషన్లపై తల్లిదండ్రులకు అవగాహన







: మే (12) సి కె న్యూస్ అబ్దుల్లా ఉస్మాన్ నారాయణఖేడ్ జిల్లా సంగారెడ్డి
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ బాలుర విభాగం-1 లో ఈరోజు 5వ తరగతి నాన్ మైనారిటీ విద్యార్థుల ప్రవేశాల కోసం లక్కీ డిప్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రిన్సిపాల్ జి. రాములు సార్ ఆధ్వర్యంలో విజయవంతంగా సాగింది.

ఈ కార్యక్రమానికి హెడ్ ఆఫీస్ నుండి ముఖ్య అతిథులుగా ఎంఎల్టీ కళాశాలల ఇన్‌చార్జ్ సుభాన్ సార్, డిస్ట్రిక్ట్ రీజినల్ లెవల్ కోఆర్డినేటర్ దివం బహుమతి మేడమ్ హాజరయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని లక్కీ డిప్ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ మరియు 10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే నాణ్యమైన విద్య ఎంతో అవసరమని అతిథులు పేర్కొన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం కూడా విద్యార్థుల విజయానికి కీలకమని తెలిపారు.

అలాగే 5వ తరగతి మైనారిటీ విద్యార్థులతో పాటు ఇంటర్మీడియట్‌లో మైనారిటీ మరియు నాన్ మైనారిటీ సీఈసీ గ్రూప్ అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో చదవడం ద్వారా ఉత్తమ విద్య, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, మంచి హాస్టల్ సౌకర్యాలు, డిజిటల్ లెర్నింగ్, క్రీడలు, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ వంటి అనేక ప్రయోజనాలు విద్యార్థులకు లభిస్తాయని వివరించారు. తమ పిల్లల భవిష్యత్తు కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను కోరారు.

నేటి పోటీ ప్రపంచంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని కష్టపడి చదివితే డాక్టర్లు, ఇంజినీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కావచ్చని ప్రోత్సహించారు.

ప్రత్యేక అతిథులుగా విజిలెన్స్ అధికారులు ఎం.డి గౌస్ పాషా గారు, జగదీశ్వర్ రెడ్డి సార్ హాజరయ్యారు. అలాగే 5వ వార్డు కౌన్సిలర్ మహేష్ సార్, బాలికల విభాగం ప్రిన్సిపాల్ మంజుల మేడమ్, కాలేజ్ కోఆర్డినేటర్ సంజీవ్ నాయక్, విఠల్ రెడ్డి, పీడీ సంతోష్, పీఈటీ అజీజ్, అనంత్ రాజ్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వారికి ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందించాలని అతిథులు సూచించారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## సుబాబుల్ తోట దగ్ధం -- రూ.3 లక్షల ఆస్తి నష్టం



సి కె న్యూస్ చింతకాని ప్రతినిధి. ఖమ్మం జిల్లా చింతకాని మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామం, బస్వాపురం రెవెన్యూ పరిధిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుని సుబాబుల్ తోట పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన అడ్వకేట్ కన్నెబోయిన నాగేశ్వరావుకు చెందిన సర్వే నంబర్ 160లో ఉన్న సుమారు ఒక ఎకరం విస్తీర్ణంలోని రెండేళ్ల వయస్సు గల సుబాబుల్ తోట అగ్నికి ఆహుతి అయింది. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపారు.

చుట్టుపక్కల రైతులు చెత్తకు నిప్పంటించడంతో మంటలు వేగంగా వ్యాపించి తోటను చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. దూర ప్రాంతం నుంచి వచ్చిన మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో చెట్లు పూర్తిగా కాలిపోయాయి. అగ్ని ప్రమాదం తీవ్రత అధికంగా ఉండటంతో తోట చుట్టూ ఏర్పాటు చేసిన పెన్సింగ్ రాళ్లు కూడా వేడికి పటుత్వం కోల్పోయాయి. కొన్ని రాళ్లు ఇప్పటికే కూలిపోగా, మరికొన్ని ముట్టుకుంటే పడిపోయే పరిస్థితిలో ఉన్నాయని రైతు నాగేశ్వరావు తెలిపారు.

రెండేళ్లుగా ఎంతో శ్రమించి పెంచుకున్న తోట ఒక్కసారిగా దగ్ధమవడంతో తీవ్రంగా నష్టపోయినట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై స్థానిక అధికారులు స్పందించి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం తరఫున తగిన పరిహారం అందించాలని బాధిత రైతు కన్నెబోయిన నాగేశ్వరావు కోరుతున్నారు.

# సంస్థ పట్ల అంకితభావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి.

ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్...



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే 12, మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ సమావేశ మందిరంలో అడిషనల్ జనరల్ మేనేజర్ (పర్సనల్)ఎస్. రమేష్ అధ్యక్షతన ఏరియా పర్సనల్ మరియు సంక్షేమ విభాగాల సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు, సంక్షేమ అధికారులు (డబ్ల్యూ ఓ ఎస్), పర్సనల్ ఆఫీసర్లు ( పి ఓ ఎస్) మరియు మినిస్ట్రియల్ స్టాఫ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏజీఎం ఎస్. రమేష్ మాట్లాడుతూ, పర్సనల్ మరియు సంక్షేమ విభాగాలు ఉద్యోగుల ప్రయోజనాల దృష్ట్యా అత్యంత కీలకమైనవని, ప్రతి ఒక్కరూ నిబద్ధతతో, పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు.

సమావేశంలోని ముఖ్య అంశాలు:

క్రమశిక్షణ చర్యలు: 2024 మరియు 2025 సంవత్సరాల్లో గైర్హాజరైన కార్మికుల చార్జ్ షీట్ ఎంక్వైరీ ప్రక్రియను సమీక్షించారు. ఇతర కారణాల వల్ల చార్జ్ షీట్ పొందిన ఉద్యోగుల ఎంక్వైరీలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

కారుణ్య నియామకాలు: పీకే ఓ సి, కె పి యు జి, ఎంఎన్ జి ఓసి, కె సి హెచ్ పి, ఏరియా వర్క్ షాప్ మరియు ఏరియా హాస్పిటల్కు సంబంధించిన కారుణ్య నియామకాల పై ప్రత్యేక దృష్టి సారించాలి. మాజీ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి, క్లెయిమ్స్ సకాలంలో పూర్తయ్యేలా చూడాలని సూచించారు.

ఆర్టీఐ మరియు కోర్టు కేసులు: ఆర్.టి.ఐ దరఖాస్తులకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో పి ఐ ఓ లకు అందజేయాలని, అలాగే కోర్టు కేసుల పురోగతిని వెబ్సైట్లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఆదేశించారు.

కార్పొరేట్ సాలరీ అకౌంట్స్: సింగరేణి ఉద్యోగులకు ఎస్బిఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మరియు కాంట్రాక్ట్ ఉద్యోగులకు హెచ్ఎఫ్సి, ఇండియన్ ఒవర్సీస్ బ్యాంక్ మరియు పంజాబ్ నేషనల్ బ్యాంక్ లలో కార్పొరేట్ సాలరీ అకౌంట్ ఓపెనింగ్ తప్పని సరిగా ప్రతి ఉద్యోగికి కలిగి ఉండాలి అన్నారు.

పదవీ విరమణ ప్రయోజనాలు: ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్( సీఎం బి ఎఫ్ , పెన్షన్, గ్రాట్యూటీ) మరియు హెచ్ బి ఎల్ ఐ ఆర్ ఎస్ /సి పి ఆర్ ఎం ఎస్ క్లెయిమస్కు సంబంధించిన పత్రాలను సకాలంలో సేకరించి, ఎటువంటి జాప్యం లేకుండా క్లియర్ చేయాలని తెలిపారు.

క్వార్టర్స్ మరియు ప్రమోషన్లు: క్వార్టర్ల కేటాయింపు, పీనల్ రెంట్, హెచ్ ఆర్ ఏ వివరాలను డిజిటలైజేషన్ చేయాలని, అలాగే అర్హులైన ఉద్యోగులకు షెడ్యూల్ ప్రకారం క్యాడర్ స్కీమ్ ప్రమోషన్లు కల్పించాలని ఆదేశించారు.

డిజిటల్ సేవలు: సి ఎం పి ఎఫ్ పోర్టల్ మరియు ఎంప్లాయి పర్సనల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ( ఈ పి ఐ ఎస్ ) వినియోగంపై ఉద్యోగుల్లో అవగాహన పెంచాలని, మాజీ ఉద్యోగులు తమ పెన్షన్ మరియు సి పి ఆర్ ఎఫ్ ఎస్ రినివల్ పనులను 'మీ సేవ' కేంద్రాల ద్వారా చేసుకోవచ్చని తెలియజేశారు.

మెడికల్ డిజిటలైజేషన్: మెడికల్ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడానికి, ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యుల ఫోటోలు, ఆధార్ నంబర్లను సేకరించి ఎస్ ఏ పి లో అప్లోడ్ చేసే పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

కొత్త ఉద్యోగులకు సీఎం పిఎఫ్ : కొత్తగా విధుల్లో చేరిన ఉద్యోగులకు సీఎం పిఎఫ్ నంబర్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో... సీనియర్ పిఓలు సింగు శ్రీనివాస్ , వి రామేశ్వర రావు. డి నరేశ్ , సంక్షేమ అధికారులు చంద్రకిరణ్ , వంశీ కృష్ణ , సాయి మౌనిక మరియు డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం. నరసింహ రావు , మధు , ఎన్.వేంకటేశ్వర రావు , ఎండి షాబుద్దీన్ , సీనియర్ అసిస్టెంట్ సుభాని, అన్ని విభాగాల మినిస్ట్రియల్ స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.

## రానున్న 15 రోజులు మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లకు అత్యంత కీలకం.



జిల్లా కలెక్టర్ అంకిత్

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే 12, రానున్న 15 రోజులు మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్లకు అత్యంత కీలకమని, క్షేత్రస్థాయిలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో జిల్లాలో మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న నిల్వలు, లోడింగ్ పరిస్థితులు, గోడౌన్ల అందుబాటు, రవాణా సదుపాయాలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఇల్లందు నియోజకవర్గ పరిధిలో సుమారు 9,300 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వలు ఉన్నాయని, లోడింగ్‌లో జాప్యం ఎందుకు జరుగుతోందనే అంశంపై కారణాలను అధికారులతో సమీక్షించినట్లు తెలిపారు.

గోడౌన్ల అందుబాటు కోసం బయ్యారం, ములకలపల్లి, కృష్ణసాగర్, దుమ్ముగూడెం, వాజేడు, వెంకటాపురం, కొత్తగూడెం, బంగారుచిలక ప్రాంతాల్లో నిల్వ సదుపాయాలు అందుబాటులో ఉన్నందున త్వరితగతిన లోడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న మూడు రోజుల్లో ఇల్లందు ప్రాంతంలోని మొక్కజొన్నను గోడౌన్లకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

మార్క్‌ఫెడ్, రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోలు, రవాణా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. రవాణా విషయం లో లోడింగ్ కాంట్రాక్టర్లు అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. అవసరమైతే మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలో పోలీస్ శాఖ సహకారం కూడా తీసుకోవాలని తెలిపారు.

హమాలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కడైనా గోడౌన్ సమస్య తలెత్తితే తాత్కాలికంగా ఫంక్షన్ హాళ్లు, పాఠశాల భవనాలు ఇతర అనుకూల భవనాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ప్రత్యేక అధికారిని నియమించి, ఆయా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలనలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రతిరోజూ కొనుగోలు వివరాలను నిరంతరం నివేదికల రూపంలో అందించాలని, కొనుగోలు పూర్తైన వెంటనే 24 గంటల్లో ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేసే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అదనపు కలెక్టర్, డీసీఎస్‌వో, డీటీవో, డీఎం సివిల్ సప్లై తదితర అధికారులు ప్రతిరోజూ కొనుగోలు, లోడింగ్, అన్‌లోడింగ్, గోడౌన్ల పరిస్థితి, హమాలీల అందుబాటు, గన్నీ బ్యాగుల సరఫరా వంటి అంశాలను పర్యవేక్షిస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటు లో ఉండి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసే దిశగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## నీట్ పేపర్ లీకుతో విద్యార్థుల జీవితాలతో చెలగాటం.......!



22 లక్షల మంది విద్యార్థులకు బిజెపి సమాధానం చెప్పాలి

సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే 12, రాజస్థాన్ రాష్ట్రంలో డబల్ ఇంజన్ సర్కార్ పేరుతో అధికారంలో ఉన్న బిజెపి నీట్ పరీక్ష పేపర్ ను లీక్ చేసి 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటాలు ఆడుతున్నారని సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి విమర్శించారు. ఈనెల మూడో తేదీన దేశ వ్యాప్తంగా జరిగిన నీటి పరీక్ష 22 లక్షల మంది విద్యార్థులు రాసారని అన్నారు. కేంద్రంలో రాజస్థాన్లో అధికారులు ఉన్న బిజెపి ఎన్డీఏ సర్కార్ నీట్ పేపర్లను లీక్ చేసి ఇప్పుడు అర్ధాంతంగా పరిష రద్దు చేయడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. కేంద్రంలోబిజెపి అధికారం చేపట్టిన నాటినుండి అనేక రకాల 89 పరీక్ష పత్రాలు లీకైనవని నర్సారెడ్డి గుర్తు చేశారు. ప్రధానంగా బిజెపి పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్ గుజరాత్ ఉత్తరప్రదేశ్ లోని అత్యధికంగా జాతీయ పరీక్ష పత్రాలు లీక్ అవుతున్నాయని అన్నారు. బిజెపి చేస్తున్న లీక్ రాజకీయాలతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని నర్సారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరాల తరబడి కష్టపడి చదివి పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ఇప్పుడు మోడీ ఏం సమాధానం చెబుతారని నర్సారెడ్డి ప్రశ్నించారు. నీట్ పరీక్షకు అత్యధికంగా పేద మధ్యతరగతి విద్యార్థిని విద్యార్థులు ఎంతో ఆశతో హాజరై తమ భవిష్యత్తుపై కలలు గంటన్న సమయంలో పేపర్ లీక్ పేరుతో రద్దు చేయడం దుర్మార్గమని అన్నారు. వైద్య విద్యార్థుల జీవితాలతో చెలగాటలాడుతున్న బిజెపికి విద్యార్థులు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. పేపర్ లీకేజీ బిజెపి పాలిత రాష్ట్రంలోనే జరిగినప్పటికీ కేంద్ర కొనసాగిల్లోనే పనిచేసే సిబిఐ విచారణతో ఏ నిజాలు బయటకు వస్తాయని నర్సారెడ్డి ప్రశ్నించారు. సిపిఐ విచారణ ఇది కేవలం కంటి తరుపు చర్య తప్ప నిజమైన బాధ్యులను శిక్షించే ఉద్దేశం బిజెపి సర్కార్కు లేదని నరసారెడ్డి అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వ పెద్దలు నీట్ పరీక్ష పత్రాల లీకేజీ పై చర్యలు చేపట్టకపోతే సిపిఐఎం ఆధ్వర్యం లో దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ చర్యలతో విద్యార్థిని విద్యార్థులు మనోవేదనకు గురి కావద్దని పట్టుదలతో మరోసారి పరీక్షకు హాజరై సత్తా చాటాలని నర్సారెడ్డి నీటి విద్యార్థులను కోరారు.

## తాటిపాముల దివ్యమూర్తి కి సన్మానం.



సి కే న్యూస్ ఖమ్మం. ఖమ్మం:-ఖమ్మం నగరానికి చెందిన తాటిపాముల దివ్య మూర్తి ని ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. భద్రాద్రి కొత్తగూడెం లో సింగరేణి లో మెడికల్ సూపర్వైజర్ గా విధులు నిర్వహించి 2008 రిటైర్ మెంట్ అన్నారు కాని ఆయనలో ఉన్న ప్రతిభ ఆధారంగా 1990 నుంచే రచయిత గా ప్రస్థానం ప్రారంభించారు. 2024లో వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ 2025 లో లండన్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్,మరియు మహానంది ఉగాది పురస్కారం2026 మే 3వ తేదీన ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతీ ఆడిటోరియంలో అన్నశీదో బ్రహ్మ అవార్డు బాబూమోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ లైన్ గణపతి సెంటర్ నిమ్మతోట ప్రాంత వాసులు అభినందించి సత్కరించారు.

## మొక్కజొన్నల కొనుగొలు సమస్యలపై జాయింట్ కలెక్టరు ను కలిసినాాావీజ చైర్మన్




సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి. మత్కేపల్లి ాావీజ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు మరియు నాగులవంచ సొసైటీ చైర్మన్ నల్లమోతు శేషగిరిరావు మొక్కజొన్న కొనుగోలు అనుమతుల విషయమై జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ని కలిసి రైతుల సమస్యలను వివరించారు. ప్రస్తుతం 500 మెట్రిక్ టన్నుల అనుమతి మాత్రమే ఉండగా, దానిని 2000 టన్నుల వరకు పెంచాలని కోరారు.

దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ప్రస్తుతం 500 మెట్రిక్ టన్నులు, అంటే సుమారు 10,000 బస్తాలకు మాత్రమే అనుమతి ఉన్నట్లు తెలిపారు. అనంతరం రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 1000 మెట్రిక్ టన్నులకు, అంటే సుమారు 20,000 బస్తాలకు అనుమతి ఇవ్వడం జరిగినది. అలాగే ప్రతిరోజు ట్రాన్స్‌పోర్ట్ మరియు కొనుగోళ్లు నిర్వహిస్తామని హామీ ఇవ్వడం జరిగినది.

అదేవిధంగా ట్రాక్టర్ల ద్వారా కొనుగోళ్లకు అనుమతి లేదని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. అయితే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చివరి రైతు వరకు మొక్కజొన్న కొనుగోలు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

రవాణా మరియు లోడింగ్ సమస్యల కారణంగా కొనుగోళ్లు కొంత నెమ్మదిగా జరుగుతున్నాయని, రైతులు సహకరించాలని అంబటి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. త్వరలోనే ఈ సమస్యలను పరిష్కరించి వేగవంతంగా కొనుగోళ్లు చేపడతామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## భద్రాచలంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు.





**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 12,**భద్రాచలం, వెంకటేశ్వర కాలనీలోని శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో విశేష పూజల ఘనంగా జరిగాయి. ప్రధాన కార్యక్రమాలు హనుమాన్ జయంతి ని పురస్కరించుకుని స్వామి వారికి విశేషంగా ఆకు పూజ నిర్వహించారు. సీతారాముల కల్యాణ మహోత్సవం: లోక కల్యాణం కోసం శ్రీ సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా, కనుల పండువగా నిర్వహించారు.

అన్న ప్రసాద వితరణ: కల్యాణం అనంతరం విచ్చేసిన భక్తులందరికీ భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

భక్తుల సందడి: ఈ వేడుకను తిలకించడానికి భద్రాచలం పరిసర ప్రాంతాల నుండి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులంతా స్వామివారి కల్యాణాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించి పునీతులయ్యారు.

ముఖ్య అతిథులు మరియు పాల్గొన్న వారు:

అన్న ప్రసాద వితరణ దాత: బోగాల శ్రీనివాస రెడ్డి దంపతులు.

ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని స్వామివారి సేవలో తరించారు. వారిలో ముఖ్యులు:

భోగాల శ్రీనివాస రెడ్డి, విష్ణుమొలకల రామ్ ప్రసాద్, రేపాక రాంబాబు, రేపాక రవికిరణ్,రేపాక సతీష్,

పునేం కృష్ణ గారు సర్పంచ్, వెంకటేశ్వర్లు తాసిల్దార్

పుల్లయ్య ఆర్టీవో, తాండ్ర నరసింహారావు,అన్నెం రామిరెడ్డి, రాసమళ్ల రాము,పద్మ, వసంతల రాజేశ్వరి, తుమ్మల రాణి, వీరితో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్త సమాజం మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

## గద్వాల నియోజకవర్గ శ్రీ జమ్ములమ్మ అమ్మవారి ని , పరశురామ స్వామిని దర్శించుకున్న.



**సీ కే న్యూస్** ఎంపీ డీకే అరుణమ్మ నడిగడ్డ భక్తుల ఇలవేల్పు అయిన జమ్మిచేడు శ్రీ జమ్ములమ్మ అమ్మవారి ని, మరియు పరశురామ స్వామి వారిని మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డికె. అరుణ భరత సింహారెడ్డి గారు, మరియ నెల్లూరు జడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ గారు, బిజెపి జిల్లా యువ నాయకురాలు డికె.స్నిగ్ధ రెడ్డి మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో పురందర్ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ,రాష్ట్ర కౌన్సిల్ మేంబర్ బండల వెంకట రాములు జిల్లా కోశాధికారి మిర్జాపురం రామచంద్ర రెడ్డి, కౌన్సిలర్లు టి. కృష్ణ వేణి,రామ లక్ష్మి,మున్సిపల్ మాజీ చైర్మన్ బండల పద్మావతి , బిజెపి నాయకులు కృష్ణం రాజు, రఘు గౌడ్,

పెద్ద పల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు..

## సారపాక ఐటిసి వెస్ట్ గేట్ వద్ద రోడ్డు ప్రమాదం..

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,మే 12,**సారపాక ఐటిసి వేస్ట్ గేట్ సమీపంలో జమాల్ పుల్ల ట్రాక్టర్ గేట్‌లోకి వెళ్తుండగా వెనక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టిన ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడికి చేరుకుని పరిస్థితిని గమనించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉండగా, ప్రమాదానికి గల కారణాలపై సమాచారం సేకరిస్తున్నారు.స్థానికులు, వాహనదారులు ఘటన స్థలంలో ఉన్నారు.



# ఘనంగా అభయ ఆంజనేయ స్వామి వారి జయంతి వేడుకలు.

**సీ కే న్యూస్ ఎటపాక ప్రతినిధి,మే 12,**పోలవరం జిల్లా ఎటపాక మండలంలో గుండాల గ్రామంలో మంగళవారం అభయ ఆంజనేయ స్వామి వారి జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.గుండాల గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయం, పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి.ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి విశేష అభిషేక పూజలతో పాటు పంచకుండాత్మక హనుమత్ కవచ హవనం, ప్రత్యేక యజ్ఞాలు నిర్వహించారు. పాలాభిషేకం, కుంభాభిషేకం, నిర్వహించారు..ఆలయ ప్రధాన అర్చకులు భద్రాచలం క్షేత్రానికి చెందిన ప్రధాన అర్చకులు కేవీ సుబ్రమణ్య శర్మ, శ్రీరామ్ విశ్వదేవ్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గుండాల ఆలయ కమిటీ ధర్మకర్త ఉ అధ్యక్షులు యడ్ల చక్రవర్తి,ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఏసుపాక రాంబాబు,గౌరవ అధ్యక్షులు రావి మాధవరావు, సహాయ కార్యదర్శి నడిపింటి రవి, గౌరవ సలహాదారులు



మామిడి రవి,కోశాధికారి యడ్ల రామ్ సతీష్ కుమార్, కార్యదర్శి నేత్రబోయిన సత్యనారాయణ,ప్రచార కార్యదర్శి జెట్టి కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు ఎడ్ల బాలాజీ, మామిడి పుల్లారావు,యడ్ల స్వరూప్ ,మారం సంపత్,మాదాసు వెంకన్న,మాచిన రామారావు, మాచిన రమణయ్య, మామిడి నాగయ్య,గోడపర్తి వీరప్రతాప్,యడ్ల రాజు , మాదినేని మనోజ్,పల్లెల లక్ష్మణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పొద్దుటూరు గ్రామంలోని నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవ కార్యక్రమం

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలోని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు ఆర్థిక ప్రణాళిక మరియు విద్యుత్ శాఖ మంత్రివర్యులు ప్రియతమ నాయకులు గౌరవ శ్రీ మల్లు భట్టి విక్రమార్కసహకారంతో మంజూరైన ఇందిరమ్మ ఇంటిని నేడు లబ్ధిదారులైన లితుడుం పోతురాజు – సైదమ్మ దంపతులు నిర్మించి పూర్తి చేసుకున్న ఇంటిని చింతకాని మాజీ జెడ్పిటిసి ఉ మధిర ఆత్మ కమిటీ డైరెక్టర్ కూరపాటి తిరీషా .గ్రామ శాఖ అధ్యక్షులు పిన్నం బ్రహ్మాచారి,లబ్ధిదారులతో..కలసి ప్రారంభించారు

ఈ సందర్భంగా.. తిరీషా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి పేదవాడి సొంత ఇంటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వం యొక్క లక్ష్యం అని ఆ విధంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల



రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క పనిచేస్తున్నారని ప్రజా ప్రభుత్వాన్ని మరొకసారి ఆశీర్వదించాలని కోరారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గున్నా కాంగ్రెస్ నాయకులు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**నాగులవంచ గ్రామంలో ఏరదేశి గురవయ్య -- కృష్ణవేణి దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించరు .

ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారగాని రాంబాయి మత్కేపల్లి మర్కెట్ కమిటి చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు , ,ఉప సర్పంచ్ అంబటి శరత్ ,మాజీ సర్పంచ్ ,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కంభం వీరభద్రం గారు,మాజీ సర్పంచ్ ఆలస్యం నాగమణి బసవయ్య ఆలస్యం శ్రీను ,ఏరదేశి గోపాల్ రావు సెక్రటరీ చిరంజీవి గారు పల్గున్నారు ఈ సందర్భంగా సొంతింటి కలను నెరవేర్చిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రెవంత్ రెడ్డి కి, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి ఏరదేశి గురవయ్య దంపతులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## జనగణన 2027 మొదటి దశ గృహాలు లెక్కింపు ప్రక్రియను పరిశీలించిన జె డి సి ఓ రఘు మరియు హీమ వర్ష సిపిఓ

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**జనగణన 2027 మొదటి దశ గృహాల లెక్కింపు ప్రక్రియ ను జెడిసిఓ రఘు హైదరాబాద్, సెన్సస్ ఆఫీసర్ హిమ వర్ష , సిపిఓ, ఖమ్మం పరిశీలించనైనది. చింతకాని మండలంలోని వందనం, లచ్చగూడెం, చింతకాని గ్రామాలను సందర్శించి ఎన్యుమరేటర్స్ మరియు సూపెర్వైసోర్సు కి సూచనలు ఇవ్వటం జరిగింది. తహసీల్దార్, ఎంపీడీఓ, ఊూా,ూూూ, రెవిన్యూ, పంచాయతీ



సిబ్బంది హాజరైనారు.

## రాష్ట్ర గీత పారిశ్రామిక చైర్మన్ కు శుభాకాంక్షలు తెలిపిన, మెదక్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జూకంటి రాజా గౌడ్



**మే 12 (సీ కే న్యూస్) చేగుంట:**తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక సంస్థ చైర్మన్ గా ఎన్నికైన, మోత్కూరి చంద్రశేఖర్ గౌడ్ ని, మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి జూగంటి రాజా గౌడ్ హృదయపూర్వకంగా వారిని కలిసి శాలువాతో సత్కరించి వారికి శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి రాజా గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వారికి తెలిపారు, రాష్ట్రంలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని వారు కోరారు,

## హనుమాన్ జయంతి సందర్భంగా బైక్ ర్యాలీ

**సి కే న్యూస్** మండల కేంద్రంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.శ్రీ కోదండసీతరామచంద్రస్వామి ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ కార్యక్రమంతో ప్రారంభమైన అభిషేక కార్యక్రమాలు,ప్రత్యేక అర్చన, పూజ కార్యక్రమాలు నిర్వహించుకొని కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్బంగా భారీ బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం ద్వారా ఆలయం భక్తులతో శోభాయమానంగా విరజిల్లిందని ఆలయ అర్చకులు సుదర్శన చార్యులు తెలిపారు.బైక్ ర్యాలీ ని ఆలయ కమిటీ వారు ప్రారంభించారు.రామాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ మీదుగా జగ్గుతండ నుండి గాంధీ సెంటర్ వయా శివాలయం మీదుగా భక్తులు బైకులతో తిరిగి రామలయానికి చేరుకున్నారు.దారి పొడవునా జై శ్రీరాం..జై హనుమాన్ నినాదాలతో మండల కేంద్రం హోరెత్తింది.ధర్మం కోసం హిందువులందరూ ఏకతాటిపైకి రావాలని నినాదాలు చేశారు.భక్తి శ్రద్ధలతో నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు,యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జై హనుమాన్ జయంతి ఉత్సవాలు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని మండలం నేరడ గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద స్వామి వారికి పట్టు వస్త్రాలు పూలతో అలంకరణ చేసి అభిషేక కార్యక్రమాలు గ్రామ అయ్యగారు శ్రీ ఇంగువ గిరిశర్మ గారు జరిపారు భక్తులు స్వామివారి దర్శించుకున్నారు అనంతరం గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ దూసరి గోపాలరావు చెవుల తిరుపతిరావు నున్నా శ్రీను వంకాయలపాటి రామయ్య గోగుల ఆది మట్టా రవి మేడా భాస్కర్ సుబ్బారావు పులిపాటి వీరబాబు షేక్ రసూల్ మట్టా వినయ్ ఏగనాటి శంకర్రావు కనకపూడి శంకరరావు తదితరులు ఉన్నారు

## హనుమాన్ జయంతి సందర్భంగా భద్రాచలం ఆలయంలో భక్తుల సందడి...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే 12,**హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ పరిసరాల్లో హనుమాన్ స్వాముల వేషధారణలో చిన్నారులు, భక్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

భక్తులు జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో ఆలయాన్ని మార్మోగించారు. ప్రత్యేక పూజలు, దర్శనాలతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుంటున్నారు.

దేవస్థానం అధికారులు, భక్తులు, హనుమాన్ భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గగన గుట్టు!?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం యూఎఫఓలకు సంబంధించిన 162 రహస్య పత్రాలను విడుదల చేసింది. దశాబ్దాలుగా ప్రభుత్వ గోప్యత చాటున భద్రపరచిన ఈ పత్రాలు ఇప్పుడు సామాన్య ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మిలిటరీ మెమోలు, అపోలో మిషన్ నివేదికలు, గ్రహాంతరవాసులను చూశామని చెప్పిన సాక్షుల వాంగ్మూలాలు ఇందులో ఉన్నాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్ ఈ పత్రాల కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించింది. "గతంలో పాలకులు ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించడంలో విఫలమయ్యారు. మేము విడుదల చేసిన పత్రాలు, వీడియోలను చూసి ఏం జరుగుతుందో ప్రజలు తమకు తామే నిర్ణయించుకోవచ్చు" అని ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతాలో ప్రకటించారు. ఈ విడుదల అమెరికా చరిత్రలో ఒక ముఖ్యమైన పరిపాలనా నిర్ణయంగా అభివర్ణించడంలో తప్పేమీ లేదు. అయితే ఈ నిర్ణయం వల్ల నిజంగా ఎంత సమాచారం బయటకు వచ్చింది అన్నది చర్చనీయాంశంగా మారింది. విడుదల చేసిన పత్రాల్లో పరిష్కారం కాని కేసులకు సంబంధించిన వివరాలు మాత్రమే ఉన్నాయని, వాటిపై ప్రభుత్వం తరఫున ఎలాంటి వ్యాఖ్యలు లేదా ముగింపు రాయలేదని వెబ్‌సైట్ స్పష్టం చేస్తోంది. అంటే ప్రభుత్వం పత్రాలను విడుదల చేసింది కానీ వాటికి సంబంధించిన అధికారిక వివరణను మాత్రం ఇవ్వలేదు. అంతేకాదు, ప్రైవేటు రంగంలో నిపుణులు ఈ పత్రాలను విశ్లేషించాలంటే దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఇది ఒకవైపు ప్రజా భాగస్వామ్యానికి తలుపు తెరచినట్టు కనిపించినా, మరోవైపు ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకున్నట్టు కూడా అర్థం చేసుకోవాలి. విడుదల చేసిన పత్రాల్లో గ్రహాంతర జీవుల ఉనికికి సంబంధించి ఎలాంటి నిర్ధారణ లేదు. అంటే దశాబ్దాలుగా ప్రజలు వేచి చూసిన సమాధానం ఇప్పటికీ రాలేదు.

విడుదలైన పత్రాలపై యూఎఫఓ ఔత్సాహికులు, నిపుణులు నిరాశ వ్యక్తం చేశారు. "ఇందులో మనకు ఎప్పటినుంచో తెలిసిన విషయాలే ఉన్నాయి" అని టెక్సాస్‌కు చెందిన మ్యూచువల్ యూఎఫఓ నెట్‌వర్క్ డైరెక్టర్ జాన్ ఎరిక్ ఎగే అన్నారు. 25 వేలకు పైగా సభ్యులున్న యూఎఫఓ నెట్‌వర్క్ ఫేస్‌బుక్ పేజ్ నిర్వాహకులు సైతం ఇవి కేవలం సాధారణ పాఠకుల కోసం, పారదర్శకత పేరుతో ఇచ్చిన భరోసా మాత్రమేనని అభిప్రాయపడ్డారు. 69 ఏళ్ల ఎలైన్ లోపెరెనా జీవితాంతం యూఎఫఓ పరిశోధనలో గడిపారు. ఆమె తల్లి చిన్నప్పుడు ఆకాశంలో గుర్తు తెలియని వస్తువు చూసిందని చెప్పినప్పటి నుంచి ఆమె సమాధానం కోసం ఎదురు చూస్తున్నారు. ఆమె నిర్వహిస్తున్న ఫేస్‌బుక్ గ్రూపులో మూడేళ్లలో సభ్యత్వం 40 వేలనుంచి లక్షకు చేరింది. ఇది యూఎఫఓలపై సమాజంలో పెరుగుతున్న ఆసక్తిని స్పష్టంగా చెబుతోంది. అయినప్పటికీ విడుదలైన పత్రాలు ఆమెను సంతృప్తిపరచలేదు. విడుదలైన చిత్రాలపై సాంకేతిక విమర్శలు కూడా వచ్చాయి. చిత్రాలలో దృశ్యాలను కుదించారని, వాటి పరిమాణం, సందర్భం సరిగ్గా లేదని, కొన్ని ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా పునర్నిర్మించినవిగా ఉన్నాయని పరిశీలకులు అంటున్నారు. ఈ సాంకేతిక లోపాలు పత్రాల విశ్వసనీయతపై సందేహాలు రేకెత్తిస్తున్నాయన్నది అక్షర సత్యం. యూఎఫ్ఓ కమ్యూనిటీలో దాదాపు 20 శాతం మంది ఇది బూటకపు ప్రచారమని, ప్రజలను తప్పుదారి పట్టించడానికి చేసిన ప్రయత్నమని భావిస్తున్నారని ఎగే చెప్పారు. ఇక్కడ మరో విషయాన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వం గ్రహాంతరవాసులతో ఒప్పందం చేసుకుందని కూడా కొంతమంది నమ్ముతున్నారు. ఈ వాదనలకు ఆధారాలు లేనప్పటికీ అవి వ్యాప్తి చెందుతున్నాయంటే, ప్రభుత్వంపై నమ్మకం ఎంతగా తగ్గిపోయిందో అర్థం చేసుకోవాలి. అంతమాత్రాన ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టలేం. ఈ విడుదల పూర్తిగా నిరర్థకమని కూడా చెప్పలేం. అమెరికా ప్రభుత్వం గుర్తు తెలియని వస్తువులను అధ్యయనం చేసిందని అధికారికంగా అంగీకరించడం ఇప్పటివరకు జరగలేదు. ఇప్పుడు జరిగింది. వాటిపై కచ్చితమైన నిర్ణయం తీసుకోలేకపోయామని చెప్పడం కూడా ఒక అడుగు ముందుకు వేసినట్టే. ఇది కొన్ని దశాబ్దాల మౌనం తర్వాత వచ్చిన అధికారిక అంగీకారం. ఇది భవిష్యత్తులో మరిన్ని పత్రాలు విడుదలవడానికి పునాది అవుతుందని ఆశించవచ్చు.

## సంపాదకీయం

ఈ మొత్తం పరిణామంలో అసలు సమస్య పత్రాల్లో ఏముందన్నది కాదు; ప్రభుత్వం దశాబ్దాలుగా ఈ సమాచారాన్ని ఎందుకు దాచిపెట్టిందన్నది. గతంలో అనేకమంది అధ్యక్షులు ఈ పత్రాలు విడుదల చేయాలని అనుకున్నారని, కానీ అది జరగలేదని ఎగే అభిప్రాయపడ్డారు. దీని వెనుక రాజకీయ కారణాలున్నాయా లేదా వ్యవస్థాగత అడ్డంకులు ఉన్నాయా అన్నది ఇప్పటికీ స్పష్టంగా తెలియడం లేదు. అమెరికాలో రాజకీయ విభేదాల నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం ఈ పత్రాలు విడుదల చేసినందుకు కొంతమంది సందేహంగా చూస్తున్నారు. ఇది నిజంగా పారదర్శకత కోసమా? లేదా రాజకీయ లక్ష్యాల కోసమా? అన్న ప్రశ్న సహజంగానే వస్తుంది. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా అందులో రాజకీయ లెక్కలు ఉంటాయి. అందువల్ల ఈ పత్రాల విడుదలను కేవలం పారదర్శకత చర్యగా చూడటం సరికాదు. అదే సమయంలో దీన్ని పూర్తిగా రాజకీయ నాటకంగా కొట్టిపారేయడం కూడా సరికాదు. ఎందుకంటే, ఏ ఉద్దేశంతో విడుదల చేసినా పత్రాలు ఇప్పుడు ప్రజల చేతుల్లో ఉన్నాయి. వాటిని విశ్లేషించే హక్కు, అవకాశం ప్రజలకు దక్కింది. ఇది ముందడుగే. ముందు ఏం జరగనుందన్న విషయంలో ప్రభుత్వం "విడతల వారీగా మరిన్ని పత్రాలు విడుదల చేస్తాం" అని చెప్పింది. ఇది అమలు జరిగితే, ఈ మొదటి విడుదల కేవలం ఒక ప్రారంభం మాత్రమే అవుతుంది. అది జరగకపోతే, ఇది మరో రాజకీయ వాగ్దానంగా మిగిలిపోతుంది. ప్రజలు ఆశించేది వాగ్దానాలు కాదు; నిరంతర, నిజాయితీగా కూడిన సమాచార విడుదల. "క్రమ పద్ధతిలో, నిజమే చెప్పాలి" అని లోపెరెనా అన్న మాటలు ఇక్కడ చాలా ప్రాసంగికంగా ఉన్నాయి. యూఎఫ్ఓ విషయంలో మాత్రమే కాదు, ఏ విషయంలో అయినా ప్రభుత్వం తన పౌరులకు సమాచారం అందించవలసిన బాధ్యత ఉంది. ఆ బాధ్యత నుంచి తప్పించుకోవడం సాధ్యం కాదు. దశాబ్దాల మౌనం తర్వాత మాటాడటం మొదలుపెట్టారు. ఇప్పుడు ఆగకూడదు. గగనంలోని గుట్టు విప్పాలంటే నేలపై నిజాయితీ తప్పనిసరి. ప్రజల నమ్మకం సంపాదించుకోవడమే అసలైన పారదర్శకత!!



# ప్రశ్నించే మనసు

ఒక సాయంత్రం పక్కింటి చిన్నారి ఓ ప్రశ్న అడిగింది... మనం చనిపోతే మన పేరు ఎక్కడుంటుంది? ఈ ప్రశ్న అసాధారణంగా అనిపించలేదు. ఆ స్వరాన్ని గమనిస్తే, భయం కన్నా ఆసక్తి, ఆశ్చర్యం ఎక్కువగా కనిపించాయి. పెద్దల సంభాషణల్లో అరుదుగా కనిపించే అన్వేషణాత్మక దృష్టి అందులో ఉంది. సమాధానాన్ని వెతకడానికన్నా ముందు, ప్రశ్నను శ్రద్ధగా వినడం ఎందుకు అవసరమో అది గుర్తు చేసింది.

సాధారణంగా పిల్లల ప్రశ్నల్ని చిన్న విషయాలుగా భావిస్తాం. కానీ అవి చిన్నవిగా కాక, సూటిగా ఉంటాయి. వయసు పెరిగేకొద్దీ మనం ప్రశ్నించడం తగ్గించి, సమాధానాలను పెంచుకుంటాం. పిల్లలు మాత్రం ప్రశ్నల ద్వారానే ప్రపంచాన్ని తెలుసుకుంటారు. ఎందుకు? అనే పదం వాళ్లకు ఒక అవకాశం. అదే పదం పెద్దలకు అసౌకర్యాన్ని కలిగిస్తుంది. పెద్దల ప్రపంచంలో స్పష్టతకు విలువ ఎక్కువ. స్పష్టమైన లక్ష్యాలు, నిర్ణయాలు, సమాధానాలు భద్రతను సూచిస్తాయి. పిల్లల ప్రపంచంలో మాత్రం సంభావ్యత ముఖ్యం. వాళ్ల ప్రశ్నలు ఎటు వెళ్లాలనేది చెప్పవు, క్షణం ఆగి చూడమంటాయి. జీవితం ఏంటి, రోజువారీ పనులు అవసరాలేనా, భయాలు ఎలా ఏర్పడుతున్నాయన్న విషయాలపై అవి దృష్టిని కేంద్రీకరిస్తాయి. జీవితంలో ఒక దశ దాటిన తరవాత ప్రశ్నల స్థానాన్ని నిర్ణయాలు ఆక్రమిస్తాయి. నిర్ణయాలు భద్రతను సూచిస్తే, ప్రశ్నలు అస్థిరతను గుర్తు చేస్తాయి. అయినా అదే అస్థిరత వ్యక్తిని లోపల నుంచి ఎదగనిస్తుంది.

టీచర్ చెప్పింది తప్పు అయితే? అని ఒక చిన్నారి అడిగినప్పుడు అందులో తిరుగుబాటు లేదు, అనుమానం కూడా లేదు. కేవలం ఆలోచన మాత్రమే ఉంది. అలాంటి ప్రశ్నలు స్థిరంగా ఉన్న నమ్మకాల్ని కదిలించగలవు. అదే పెద్దలకు అసౌకర్యం కలిగిస్తుంది. పిల్లల ప్రశ్నలు సమాధానాలకన్నా మన స్థిరత్వాన్ని పరిశీలిస్తాయి. సిద్ధంగా ఉన్న సమాధానం లేకపోతే పెద్దలు అసహనాన్ని ప్రదర్శిస్తారు. పిల్లలు మాత్రం వేచిచూస్తారు.

పిల్లలతో మాట్లాడేటప్పుడు పెద్దలు తరచుగా ఇలా కాదు, అలా అనే సూచనలు ఇస్తుంటారు. పిల్లల ప్రశ్నలు మాత్రం ఇలా ఎందుకు? అనే స్థాయిలోనే ఉంటాయి. ఈ తేడానే తత్వచింతనకు ఆరంభ బిందువు. తత్వం అనేది కేవలం గ్రంథాల్లో ఉన్న క్లిష్ట ఆలోచనల సమాహారం కాదు. రోజువారీ జీవితంలో పుట్టే అమాయక సందేహాల నుంచే అది రూపుదిద్దుకుంటుంది. పిల్లలను సమాధానాల వైపు నడిపించాలనే తొందర సమాజానిది. కానీ తెలివి అంటే ఎక్కువ సమాచారాన్ని మెదడులో నింపుకోవడం కాదు, ప్రశ్నలను నిలుపుకొనే సామర్థ్యం. ప్రశ్నలే ప్రగతికి పుట్టిళ్లు. దాన్ని గుర్తిస్తే పిల్లల ప్రశ్నలు ఒక సమస్యగా కాక, ఒక అవకాశంగా కనిపిస్తాయి.

విచిత్రమేమిటంటే.. పిల్లలు అడిగే ప్రశ్నలకు తరచూ పెద్దల దగ్గర సమాధానం ఉండదు. కానీ ఆ నిజాయితీని అంగీకరించే ధైర్యం మాత్రం మరీ అరుదుగా కనిపిస్తుంది. "తెలియదు" అనే రెండు అక్షరాలు ఒక్కోసారి అన్ని సమాధానాల కంటే నిజాయితీగా ఉంటాయి. ఆ మాట చెప్పగలిగినప్పుడే పెద్దలు నిజంగా పిల్లలతో సమానంగా నిలుస్తారు. ఒక ప్రశ్నకు సమాధానం తెలియకపోవడం బలహీనత కాదు.. కలిసి వెతకాలనే కోరిక మొదలవడమే అసలైన జ్ఞానం. పిల్లల ప్రశ్నలు మనల్ని తిరిగి విద్యార్థులుగా మారుస్తాయి.. అది గుర్తించగలిగితే చాలు.

జీవితం పూర్తిగా అర్థమయ్యే విషయం కాకపోయినా, అర్థం చేసుకునే ప్రయత్నం చేయడం పిల్లల దగ్గర సహజంగా కనిపిస్తుంది. దాన్ని వారు జీవితాంతం కొనసాగించాలంటే పెద్దవారు తీర్పులు చెప్పడం మాని చిన్నారుల ప్రశ్నల పట్ల శ్రద్ధ చూపాలి.

# బీసీ బిడ్డల కలలకు కొత్త వెలుగు



ఆంధ్రప్రదేశ్‌లో బీసీ సంక్షేమ హాస్టళ్లంటే ఒకప్పుడు గుండె ద్రవించే దృశ్యాలు కళ్లముందు కనిపించేవి. పాడుపడ్డ గదులు, చిల్లుపడిన పైకప్పులు, నెలల తరబడి అందని డైట్ బిల్లులు, ఆకలికి అలమటించే విద్యార్థులు, కలుషిత నీరు, వెలుతురులేని వసతి గృహాలు... గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీసీ హాస్టళ్లు అక్షరాలా నరకాన్ని తలపించాయి. చదువు మాట దేవుడెరుగు, కనీసం పొట్ట నిండని రోజులవి. విద్యార్థుల భవిష్యత్ నిర్మించే కేంద్రాలు కావాల్సిన సంక్షేమ హాస్టళ్లు.. సంఖ్యల నిర్వహణే అయ్యాయి. కాంట్రాక్టర్లు సరుకులు సరఫరా చేయడానికి నిరాకరించారు. విద్యార్థులు నాసిరకం భోజనంతో రోజులు గడిపారు. పారిశుధ్యం లోపించి అనారోగ్యం పాలయ్యారు. ఐదేళ్ల చీకటి పాలనలో బీసీ బిడ్డల స్వప్నాలు మట్టిలో కలిసిపోయాయి.

### మారిన తీరు.. మారిన హాస్టళ్లు

2024లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ సంక్షేమ హాస్టళ్లలో మొదలైన మార్పు చిన్నది కాదు. అది కేవలం పరిపాలనా చర్య మాత్రమే కాదు; ఆ మార్పు వెనుక స్పష్టమైన సంకల్పం ఉంది. పేద విద్యార్థి ఆకలి తీరాలి. ఆరోగ్యంగా ఉండాలి. పరిశుభ్ర వాతావరణంలో చదువుకోవాలి.. అనే మూలతత్వాన్ని ప్రభుత్వం అమలుపర్చడం మొదలుపెట్టింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం తీసుకున్న మొట్టమొదటి నిర్ణయాలలో ఒకటి -గత ప్రభుత్వ కాలంనుంచి పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.110 కోట్ల డైట్ బకాయిల చెల్లింపు. బిల్లులు చెల్లించగానే కాంట్రాక్టర్లు సరఫరా ప్రారంభించారు. హాస్టళ్లలో సరైన మెనూ అమలు మొదలైంది. సన్నబియ్యంతో పౌష్టికాహారం అందుబాటులోకి వచ్చింది. ఒక్కమాటలో చెప్పాలంటే, విద్యార్థుల పళ్లెంలో మళ్ళీ అన్నం కనిపించింది.

### ఆరోగ్యం, పరిశుభ్రత -కొత్త ప్రాధాన్యతలు

భోజనం తర్వాత ప్రభుత్వం దృష్టిపెట్టిన రంగం ఆరోగ్యం. రూ.21 కోట్ల వ్యయంతో హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసింది. ఒకప్పుడు కలుషిత నీటితో జబ్బులపాలైన విద్యార్థులకు ఇప్పుడు శుభ్రమైన తాగునీరు అందుతోంది. దోమల నివారణకు కిటికీలకు దోమతెరలు, నిరంతర విద్యుత్ కోసం ఇన్వర్టర్లు, స్వచ్ఛ భారత్ మిషన్ కింద మరుగుదొడ్ల నిర్మాణం, వంటసామగ్రి కొనుగోలుకు నిధుల విడుదల -ఇవన్నీ హాస్టళ్లలో జీవన ప్రమాణాలను మెరుగైన స్తితికి తీసుకెళ్లాయి. పారిశుద్ధ్య సిబ్బంది నియామకం, కుక్‌లు, కమాటీల వ్యవస్థీకరణ ద్వారా హాస్టళ్ల నిత్యనిర్వహణలో క్రమశిక్షణ తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోంది. ఇవన్నీ వేరువేరు చర్యల్లా కనిపించినా, వీటి వెనుక ఒకే ఒక్క లక్ష్యం ఉంది. హాస్టల్లో ఉండే ప్రతి విద్యార్థి గౌరవంగా, ఆరోగ్యంగా జీవించాలి.

### సాంకేతికత ద్వారా పారదర్శకత

సంక్షేమ పాలన మెరుగుపడాలంటే నిధులు మాత్రమే చాలవు. అవి సద్వినియోగం కావాలి. ఈ సత్యాన్ని గుర్తించిన ప్రభుత్వం ముఖ ఆధారిత హాజరు నమోదు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎస్)ను బీసీ హాస్టళ్లలో ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో తొలిసారిగా ఈ వ్యవస్థ బీసీ హాస్టళ్లలో అమలవడం విశేషం. ఇప్పుడు విద్యార్థుల నిజమైన హాజరు నమోదవుతోంది. సిబ్బంది సమయపాలన పెరిగింది. నిత్యావసర సరుకుల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ చర్యవల్లే ఏడాదికి రూ.6 కోట్లకు పైగా ఆదా అవుతోంది. అంతేకాదు, హెచ్‌పీటీఎస్ యాప్ ద్వారా హాస్టళ్ల రోజువారీ పరిస్థితుల ఫోటోలు నిత్యం అప్‌లోడ్ అవుతున్నాయి. మెనూ అమలు, తాగునీరు, పరిశుభ్రత, మరుగుదొడ్ల స్థితి -ఇవన్నీ రాష్ట్రస్థాయి అధికారులు నేరుగా పర్యవేక్షించగలుగుతున్నారు. కార్యాలయంలో కూర్చుని కాగితాల్లో చూడడం కాదు; తెర మీద నిజమైన చిత్రం కనిపిస్తోంది.

### ప్రజాభిప్రాయమే అసలు నిదర్శనం

ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నామని చెప్పుకోవడం సులభం. కానీ ఫలితాలు నిజంగా ప్రజలకు చేరాయా అన్నది వేరే విషయం. ఇటీవల నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో విద్యార్థుల తల్లిదండ్రులను నేరుగా సంప్రదించి వారి అభిప్రాయాలు సేకరించారు. "మెనూ సరిగ్గా అమలవుతోందా? వార్డెన్ పనితీరు ఎలా ఉంది? మొత్తంగా హాస్టల్ నిర్వహణపై మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగిన ప్రశ్నలకు 78.2 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంతేకాదు, మొదటి విడతలో 71.30 శాతంగా ఉన్న సంతృప్తిస్థాయి రెండో విడతకు వచ్చేసరికి 78.20 శాతానికి పెరిగింది. ఇది మార్పు ఒకే దెబ్బకు వచ్చిందని కాదు. నిరంతరంగా మెరుగుపడుతోందని చెబుతోంది. రాష్ట్రంలోని ఇతర సంక్షేమ హాస్టళ్లన్నింటిలోనూ బీసీ హాస్టళ్లే అత్యున్నత సంతృప్తి స్థాయితో నంబర్ వన్ స్థానంలో నిలవడం చిన్న విషయం కాదు.

### చదువులో కనిపిస్తున్న మార్పు

హాస్టల్ వాతావరణం మెరుగుపడింది. ఇప్పుడు దాని ఫలితాలు తరగతి గదిలో కనిపిస్తున్నాయి. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో బీసీ హాస్టళ్ల విద్యార్థులు 85.99 శాతం ఉత్తీర్ణత సాధించారు. మంచి భోజనం, శుభ్రమైన వాతావరణం, సరైన విద్యుత్, నిరంతర పర్యవేక్షణ.. ఇవన్నీ కలిసి మంచి ఫలితాన్ని సాధ్యం చేశాయి. ఎస్.ఆర్. శంకరన్ రిసోర్స్ సెంటర్ల ఏర్పాటు ద్వారా గ్రామీణ బీసీ విద్యార్థులు కూడా డిజిటల్ విద్యను అందుకోగలుగుతున్నారు. ఒకప్పుడు నగర విద్యార్థులకు మాత్రమే అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ విద్య ఇప్పుడు మారుమూల హాస్టళ్ల వరకూ చేరింది. ఇది కేవలం సదుపాయం కాదు; భవిష్యత్తుకు బాట.

### మంత్రి సవిత నేతృత్వం

బీసీ సంక్షేమ మంత్రి ఎస్ సవిత శైలి ఈ మార్పుల వెనుక ఒక ముఖ్యమైన కారణంగా నిలుస్తోంది. ఆకస్మిక తనిఖీలు, విద్యార్థులతో నేరు సంభాషణ, అక్కడికక్కడే సమస్యల పరిష్కారం -ఇవి అధికార యంత్రాంగంపై నిరంతర ఒత్తిడి తెచ్చాయి. సంక్షేమ హాస్టల్ నిర్వహణను ఫైళ్ల వ్యవహారంగా కాకుండా విద్యార్థుల జీవితాలతో ముడిపడిన బాధ్యతగా చూడడంవల్లే ఈ మార్పులు సాధ్యమయ్యాయి.

### ఆశలకు చిరునామా

సంక్షేమం అంటే నగదు పంచడం మాత్రమే కాదు. పేద పిల్లవాడికి గౌరవప్రదమైన వసతి, పౌష్టికాహారం, పరిశుభ్రమైన జీవనం, నాణ్యమైన విద్య కల్పించడం కూడా అంతే ముఖ్యం. ఒకప్పుడు నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచిన బీసీ హాస్టళ్లు ఇప్పుడు రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయంటే అది చాలా పెద్ద మార్పు.

ఆ మార్పు వెనుక పరిపాలనా సంకల్పం ఉంది. నిరంతర పర్యవేక్షణ ఉంది. సాంకేతికత వినియోగం ఉంది. నిధుల సమర్థ వినియోగం ఉంది. అన్నింటికీ మించి, బీసీ బిడ్డ భవిష్యత్తు తమ బాధ్యత అనే నిజమైన భావన ఉంది. ఆ భావన బలంగా ఉన్నంతకాలం -సంక్షేమ హాస్టల్ కేవలం నాలుగు గోడల నిర్మాణం కాదు. అది బీసీ బిడ్డల ఆశలకు చిరునామా అవుతూనే ఉంటుంది.



**సమయ నిర్వహణ**

సమయాన్ని లెక్కిస్తూనే ఉండాలి. ప్రతి నిమిషాన్ని విలువైనదిగా భావిస్తూనే ఉండాలి. వృథా గడిపిన ప్రతి క్షణం తిరిగి రాదని గుర్తిస్తూనే ఉండాలి. ఇవన్నీ ఒకెత్తు.. సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం మరో ఎత్తు. ఎంత తెలిసినా.. ఎంత అర్థమైనా.. చేతిలో ఉన్న క్షణాన్ని పట్టుకోనంతవరకూ అవన్నీ వట్టి మాటలే. సమయాన్ని గెలిచిన వాడే జీవితాన్ని గెలుస్తాడు.

-మహాదేవ

**వింతల్లో వింతలు**

## ఇదో తరహా పిచ్చి..!



భయపెట్టడానికి చెవులు వికృతం చేసుకుంటున్నారు రష్యన్లు! రష్యాలో పురుషులు తమను చూసి ఇతరులు భయపడాలని ఎంఎంఏ ఫైటర్ల మాదిరిగా చెవులు వికృతంగా మార్చుకుంటున్న కొత్త ట్రెండ్ మొదలైంది. రెజ్లింగ్, బాక్సింగ్‌వంటి క్రీడల్లో గాయాలవల్ల వచ్చే "కాలీఫ్లవర్ ఇయర్" ఇప్పుడు రష్యాలో ఒక ఫ్యాషన్ ట్రెండ్‌గా మారింది. ఒక్కో చెవికి 6,000 రూబుళ్లు (సుమారు రూ.5,600) చెల్లించి ఈ విచిత్రమైన శస్త్రచికిత్స చేయించుకుంటున్నారు. ఆపరేటర్ ఒక నెల ముందే బుకింగ్ అయిపోతోంది. అయితే నిపుణులు మాత్రం ఇది వినికిడి లోపానికి, చెవి వాపుకు దారితీయవచ్చని హెచ్చరిస్తున్నారు. "చెవి మార్చుకున్నా అసలైన ఆత్మవిశ్వాసం రాదు" అని మనోవైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# మే 19 అర్ధరాత్రే ఎన్టీఆర్-నీల్ గ్లింప్స్!



ఎన్టీఆర్ అభిమానులకు బిగ్ సర్‌ప్రైజ్. స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎన్టీఆర్ బిగ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఫస్ట్ గ్లింప్స్ మే 20 (తారక్ పుట్టినరోజు) కాదు, ఒక రోజు ముందుగానే..మే 19 అర్ధరాత్రి 12 గంటలకే విడుదల కానుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. మేకర్స్ అధికారికంగా పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేస్తామని ప్రకటించిన తర్వాత, ఇప్పుడు అర్ధరాత్రే రిలీజ్ చేయాలని ప్లాన్ మార్చినట్టు తెలుస్తోంది. కెజిఎఫ్, 'సలార్' చిత్రాలతో మాస్ యూనివర్స్‌ను సృష్టించిన ప్రశాంత్ నీల్, ఇప్పుడు తారక్‌కు ఎలాంటి ఎలివేషన్ ఇవ్వబోతున్నాడోనని అభిమానుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. ఇప్పటికే సెట్స్ ఫోటోలు, చిన్నచిన్న లీక్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఈ గ్లింప్స్‌తో తారక్ లుక్, క్యారెక్టర్ నేచర్, సినిమా బ్యాక్‌డ్రాప్‌పై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. మరోవైపు మే 18న రామ్‌చరణ్ 'పెద్ది' ట్రైలర్, మరుసటి రోజే తారక్ గ్లింప్స్ రావడంతో మెగా-నందమూరి అభిమానుల మధ్య సోషల్ మీడియా వార్ పీక్స్‌కు చేరుతుందని ట్రేడ్‌వర్గాలు అంచనా వేస్తున్నాయి. మైత్రి మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం 2027 జూన్ 11న గ్రాండ్‌గా విడుదల కానుంది. 'ఆర్ఆర్ఆర్' తర్వాత తారక్ తొలి సోలో బిగ్ ప్రాజెక్ట్ కావడంతో ప్రతి అప్డేట్ భారీ హైప్ సృష్టిస్తోంది.

# 'వారణాసి' న్యూ షెడ్యూల్ స్టార్ట్

ప్రపంచ సినీ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న రాజమౌళి-మహేష్ బాబు కాంబినేషన్ చిత్రం 'వారణాసి' తాజా షెడ్యూల్ నేటినుంచి హైదరాబాద్‌లో ప్రారంభమైంది. కొద్దిరోజుల విరామం తర్వాత మళ్లీ షూటింగ్ మొదలవుతుండటంతో అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొంది. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్లలో మహేష్ బాబు, ప్రియాంకచోప్రాపై కీలక సన్నివేశాలు చిత్రీకరించిన తర్వాత, యూనిట్ కెన్యా, యూరప్ సహా మరికొన్ని అరుదైన విదేశీ లొకేషన్లకు వెళ్లనుంది. రామాయణ నేపథ్యంలో టైమ్ ట్రావెల్ ఎలిమెంట్స్‌తో సాగే ఈ కథ వారణాసి నుంచి మొదలై కెన్యా, అంటార్కిటికా వరకు విస్తరించనుందని తెలుస్తోంది. రామాయణ యుద్ధ నేపథ్యంలో రూపొందిస్తున్న 25 నిమిషాల భారీ యాక్షన్ ఎపిసోడ్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని, దానికోసం దాదాపు 60 రోజులపాటు షూటింగ్ జరిపినట్టు సమాచారం. విజువల్స్ పరంగా హాలీవుడ్‌స్థాయిలో ఉండబోతుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.





మహేష్ బాబు 'రుద్ర' పాత్రలో, ప్రియాంక చోప్రా 'మందాకిని' పాత్రలో నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ 'కుంభ' పాత్రలో కనిపించనున్నారు.

ఇటీవల మెక్సికోలో జరిగిన ఇంటర్నేషనల్ ఈవెంట్‌లో సినిమాను పరిచయం చేసిన బృందం, త్వరలో ఫ్రాన్స్‌లో కూడా భారీ ప్రమోషన్స్ నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. 'వారణాసి' 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

ఫోస్టార్!




# మద్యం దుకాణాలకు చెక్

## విజయ్‌కి కమల్ ప్రశంసలు





తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు, దేవాలయాలు, బస్టాండ్‌లకు సమీపంలో ఉన్న 717 మద్యం దుకాణాలను తక్షణమే మూసివేయాలని ఆదేశించారు. ప్రజల చిరకాల వాంఛ అయిన ఈ నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ప్రముఖ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ కూడా ఎక్స్ వేదికగా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ సీఎం విజయ్‌ను అభినందించారు. తమిళ కుటుంబాల ఆకాంక్షలను గౌరవిస్తూ, పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే సీఎం విజయ్ తీసుకున్న ఈ చర్య అభినందనీయమని కమల్ హాసన్ పేర్కొన్నారు. మద్యం విక్రయాలు ప్రభుత్వ ప్రధాన విధి కాకూడదని, మద్యం ప్రవాహాన్ని నియంత్రించే బాధ్యతను మాత్రం ప్రభుత్వం తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుతానికి 717 దుకాణాలను మూసివేయడం ద్వారా శుభారంభం జరిగిందని, భవిష్యత్తులో ఈ సంఖ్యను మరింత పెంచుతూ సంపూర్ణ నియంత్రణ దిశగా అడుగులు వేయాలని కోరారు.

# రవితేజ రెమ్యూనరేషన్ కట్

మాస్ మహారాజా రవితేజ గత కొంత కాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయం అందుకోలేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. వరుస పరాజయాల నేపథ్యంలో తన కెరీర్‌ను మళ్లీ పట్టాలెక్కించాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలో పారితోషికం విషయంలో కీలకమైన నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఒకప్పుడు రూ.25 కోట్ల వరకు రెమ్యూనరేషన్ తీసుకున్న రవితేజ, ప్రస్తుతం దాన్ని రూ.15 కోట్లకు తగ్గించుకున్నారని టాక్. నిర్మాతలపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఉండాలని, మంచి కంటెంట్‌తో మళ్లీ విజయపథంలో నిలబడాలని ఆయన భావిస్తున్నారట. అందుకే కథల ఎంపికలో కూడా ఆయన ఈసారి చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఇరుముడి' ఆయన కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన ప్రయత్నమే.

ఇప్పటివరకు మాస్, కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌కే పరిమితమైన రవితేజ, ఈసారి థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకోవడం అభిమానుల్లో మంచి ఆసక్తిని పెంచుతోంది. కథ, ట్రీట్‌మెంట్, పాత్ర స్వభావం అన్నీ కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. ఈ సినిమా విజయమే ఇప్పుడు రవితేజ కమ్‌బ్యాక్‌కు అసలైన పరీక్షగా మారింది. 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాలు ఇస్తే మాస్ మహారాజా మళ్లీ ఫామ్‌లోకి రావడం ఖాయమని సినీ



విశ్లేషకులు భావిస్తున్నారు. టాలీవుడ్‌లో స్టార్ డైరెక్టర్లందరూ టాప్ హీరోలతో బిజీగా ఉండటంతో, రవితేజకు యంగ్ డైరెక్టర్లే ప్రధాన బలంగా మారుతున్నారు. కొత్త కాన్సెప్ట్స్, డిఫరెంట్ స్క్రిప్ట్స్‌తో మళ్లీ ప్రేక్షకులను ఆకట్టుకోవాలనే లక్ష్యంతో మాస్ మహారాజా ముందుకు సాగుతున్నాడట.

## బ్రిట్నీ స్పియర్స్‌కు

# ఒకరోజు జైలు



ప్రముఖ పాప్ సింగర్ బ్రిట్నీ స్పియర్స్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నేరాన్ని అంగీకరించారు. దక్షిణ కాలిఫోర్నియాలో మార్చిలో ఆమెపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదైన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం విచారణ జరగ్గా... ఆమె నేరాన్ని అంగీకరించారు. దీంతో ఆమెకు వెంచురా కౌంటీ సుపీరియర్ కోర్టు ఒకరోజు జైలు శిక్షతోపాటు కొన్ని నిబంధనలు విధించింది. శిక్షతోపాటు ఆమె భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం చేయకుండా ఉండటానికి కోర్టు పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలలపాటు ప్రభుత్వం నిర్వహించే డ్రంక్ అండ్ డ్రైవ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించింది. ప్రతి వారం థెరపీ సెషన్లకు హాజరుకావాలని, నెలకు రెండుసార్లు తప్పనిసరిగా సైకియాట్రిస్టును కలవాలని సూచించింది.

# 23ఏళ్ల తర్వాత త్రిషతో..

ఆర్.జె. బాలాజీ దర్శకత్వంలో సూర్య-త్రిష జంటగా తెరకెక్కిన బిగ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వీరభద్రుడు'. ఈ నెల 14న విడుదల కానున్న చిత్రం ముందస్తు వేడుకలో సూర్య సోదరుడు కార్తి, దర్శకుడు వెంకీ అట్లూరి, నిర్మాత సుప్రియా యార్లగడ్డ పాల్గొన్నారు. వేడుకలో మాట్లాడిన సూర్య, "నమ్మకం ఉన్న చోట మ్యాజిక్ తప్పకుండా జరుగుతుంది. ఈ సినిమాపై నాకు అదే నమ్మకముంది" అన్నారు. దేవుడితో ముడిపడిన కథలో తొలిసగం అద్భుతమైన కోర్ట్‌రూమ్ డ్రామాగా సాగుతుందని, రెండోసగం పూర్తిగా మాస్ మసాలాగా మారుతుందన్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మించిన చిత్రంలో 23 ఏళ్ల తర్వాత త్రిషతో కలిసి నటించడం మంచి అనుభవమని సూర్య భావోద్వేగంగా పేర్కొన్నారు. సూర్య సోదరుడు కార్తి మాట్లాడుతూ, "దేవుడు పూనిన ఇలాంటి మాస్ పాత్రను అన్నయ్య తప్ప వేరే ఎవరూ అలా పండించలేరు" అని ప్రశంసించారు. 'బాహుబలి'లో ప్రభాస్ శివలింగం మోసినట్లుగా, భుజాలపై ఎంత బరువైన పాత్ర పెట్టినా మోయగలిగే నటుడు సూర్య మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. తాను ఈ సినిమాను తెలుగులోనే చూడబోతున్నానని కూడా కార్తి చెప్పారు. అభిమానులు కోరుకున్న స్థాయిలో సూర్యను తెరపై చూపించామని దర్శకుడు ఆర్.జె. బాలాజీ చెప్పారు. ఫ్యామిలీ ఆడియెన్స్‌ను పూర్తిగా అలరించే చిత్రంగా 'వీరభద్రుడు' తెరకెక్కిందన్న భావన కనిపిస్తోంది.

